# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 82 | సోమవారం 24, నవంబర్ 2025 | పేజీలు: 08 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com




## అంతర్జాతీయ స్థాయిలో
# గ్లోబల్ సమ్మిట్

**పాస్‌లు లేకుండా ఎవరూ ఎంట్రీ కావడానికి వీలు లేదు**

**ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదు**

**పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి**

**అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**డిసెంబర్ 8, 9న**

**జరిగే రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల పరిశీలన**

**తెలంగాణ స్కిల్స్**

**యూనివర్సిటీ నిర్మాణ పనులు సైతం**

**ప్రజాస్వరం, హైదరాబాద్:**

రాష్ట్రంలో జరుగనున్న ప్రతిష్ఠాత్మక ఈవెంట్ 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' ఏర్పాట్లు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా భారత్ ఫ్యూచర్ సిటీని సందర్శించి, జరుగుతున్న పనుల పురోగతిని శుక్రవారం సమీక్షించారు. డిసెంబరు 8, 9 తేదీల్లో జరగనున్న ఈ అంతర్జాతీయ సదస్సు కోసం అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సైట్‌లోని పలు నిర్మాణాలు, మౌలిక వసతుల పనులను ప్రత్యక్షంగా పరిశీలించిన సీఎం, అధికారులు సమగ్ర ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు. సమ్మిట్‌కు అంతర్జాతీయ ఖ్యాతి గల వ్యాపార నేతలు, పెట్టుబడిదారులు, వివిధ దేశాల నుండి వచ్చే ప్రతినిధులు పాల్గొననున్న నేపథ్యంలో ఏర్పాట్లు ప్రపంచ ప్రమాణాలతో ఉండాలని సూచించారు. ముఖ్యంగా వివిధ దేశాల అంబాసిడర్లు కూడా హాజరయ్యే అవకాశం ఉన్నందున భద్రత, అతిథ్య సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం ఆదేశించినట్లు తెలిసింది. పాల్గొనే ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రవాణా, వసతి, **మిగతా 2లో..**

## సత్యసాయి సేవలు మార్గదర్శకం

**జీవితాంతం కార్యరూపంలో మానవసేవను ఆదర్శించారు**

**ఆయన బోధనలు అందరూ ఆదర్శంగా తీసుకోవాలి**

**సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు**




## జీ 20 వేదికగా
# డిజిటల్ ఉద్యమం



**ప్రధాని నరేంద్రమోడీ**

**కీలక ప్రతిపాదన**

**భారత్, బ్రెజిల్,**

**దక్షిణాఫ్రిక మధ్య దృఢ బంధం**

**జీ 20 వేదికగా కీలకమైన**

**ప్రతిపాదనలు**

**ప్రజాస్వరం, న్యూఢిల్లీ:**

జీ20 సదస్సు సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో కీలక అంతర్జాతీయ డిజిటల్ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా దేశాలతో కూడిన ఇబ్సా కూటమిని మరింత దృఢం చేస్తూ ఇబ్సా డిజిటల్ ఇన్నోవేషన్ అలయన్స్ ఏర్పాటుకు ఆయన ప్రతిపాదించారు. జోహెన్నస్‌బర్గ్‌లో బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డా సిల్వా, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసాలతో ద్వైపాక్షిక సమావేశం అనంతరం ఈ విషయాన్ని ప్రకటించారు.ఈ నూతన డిజిటల్ అలయన్స్ లక్ష్యం **మిగతా 2లో..**



## కొత్త సీజీఐగా జస్టిస్ సూర్యకాంత్..
# నేడు ప్రమాణం

### 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ నియామకం

**ప్రజాస్వరం, న్యూఢిల్లీ:**

భారత సుప్రీం కోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా (సీజీఐ) జస్టిస్ సూర్యకాంత్ నియమితులయ్యారు. ఈ నెల 24వ తేదీ సోమవారం ఆయన సీజీఐగా ప్రమాణం చేయనున్నారు. 2027 ఫిబ్రవరి 9 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. హరియాణా రాష్ట్రానికి చెందిన వ్యక్తి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టడం ఇదే మొదటి సారి కావడంతో జస్టిస్ సూర్యకాంత్ **మిగతా 2లో..**

## చండీగఢ్‌పై ఏ నిర్ణయం
# తీసుకోలేదు

**కేంద్రపాలిత ప్రాంతాలపై**

**రాష్ట్రపతికి అధికారం**

**ఇటీవల ప్రతిపాదనలు**

**సిద్ధం చేసిన కేంద్రం**

**తాజాగా కాస్త వెనక్కి**

**తగ్గిన కేంద్ర ప్రభుత్వం**

**ప్రజాస్వరం, చండీగఢ్:**

కేంద్ర పాలిత ప్రాంతాలకు వర్తించే ఆదేశాలు, చట్టాలను నేరుగా చేసే అధికారాలను రాష్ట్రపతికి కల్పించిన రాజ్యాంగ అధికరణం 240 పరిధిలోకి చండీగఢ్‌ను కూడా తీసుకు రావాలని **మిగతా 2లో..**








## భాగ్యనగరానికి
# పటేల్ గొప్ప సేవ

**ఆయన కంటే గొప్పగా**

**చేసినవారెవరూ లేరు**

**రజాకార్ల హత్యాకాండ**

**నుంచి విముక్తి కల్పించారు**

**యూనిటీ మార్చ్‌లో**

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

## ఆగింది ఐబొమ్మే..
# పైరసీ కాదు

**శుక్రవారం రిలీజైన సినిమాలన్నీ మూవీ రూల్జ్‌లో ప్రత్యక్షం**

**థియేటర్ లో రికార్డు చేసి పైరసీ సైట్ లో అప్ లోడ్**

**ప్రేమంటే, రాజు వెడ్స్ రాంబాయి సహా ఇతర సినిమాలు కూడా..**




**ప్రజాస్వరం, హైదరాబాద్:**

పైరసీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించినా ఫలితం లేకుండా పోయింది. ఐబొమ్మ వెబ్ సైట్ నిర్వాహకుడు ఇమంది రవిని అరెస్టు చేసి ఐబొమ్మతో పాటు బప్పం టీవీ సైట్ లను క్లోజ్ చేసినా సినిమా పైరసీ ఆగడంలేదు. ఆగింది ఐబొమ్మే తప్ప పైరసీ కాదని తాజాగా తేలింది. శుక్రవారం విడుదలైన సినిమాలన్నీ ఒకే రోజులో పైరసీ సైట్లలో ప్రత్యక్షం కావడమే దీనికి నిదర్శనం. ఐబొమ్మ కన్నా ముందునుంచే సినిమాలను పైరసీ చేస్తున్న **మిగతా 2లో..**

## నత్తనడకన టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణం

నిర్మాణపనులు

ముందుకు సాగడం లేదు

వైద్యసేవలపై ఎందుకు

దృష్టి పెట్టడం లేదు

మాజీ మంత్రి

హరీశ్ రావు విమర్శలు



**ప్రజాస్వరం, హైదరాబాద్:**

టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నాయకుడు తన్నీరు హరీశ్ రావు తీవ్ర ఆక్షేపణలు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన, ప్రభుత్వ వైఫల్యాలను ఉదాహరించేందుకు టిమ్స్ ప్రాజెక్టును ప్రధానంగా ప్రస్తావించారు.హరీశ్ రావు మాట్లాడుతూ సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రిలో నెలరోజుల్లో వైద్య సేవలు ప్రారంభిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. "ప్రభుత్వం ప్రకటించి **మిగతా 2లో..**

## మరికొంత గడువు ఇవ్వండి

**స్పీకర్‌కు ఎమ్మెల్యే దానం లేఖ**

**వివరణకు అదనపు గడువుకు విజ్ఞప్తి**

**ఇప్పటికే రెండుసార్లు స్పీకర్ నోటీసులు**




## వన్డే సారథిగా కేఎల్ రాహుల్

**దక్షిణాఫ్రికా**

**సిరీస్‌కు టీమ్ ఎంపిక**

**అందుబాటులో**

**లేని గిల్, అయ్యర్**

**కెప్టెన్‌గా రాహుల్‌కు అవకాశం**

**కోహ్లీ, రోహిత్,**

**జడేజాలకు జట్టులో ఛాన్స్**



**ప్రజాస్వరం, ముంబై :**

దక్షిణాఫ్రికాతో స్వదేశంలో నవంబర్ 30 నుంచి ప్రారంభం కానున్న 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు భారత జట్టుని బీసీసీఐ ఆదివారం ప్రకటించింది. భారత రెగ్యులర్ వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ **మిగతా 3లో..**

## కొత్త సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్..
# నేడు ప్రమాణం



**మొదటిపేజీ తరువాయి**

చారిత్రక రికార్డు సృష్టించనున్నారు.

**గ్రామం నుంచి సుప్రీంకోర్టు వరకు**

జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హరియాణా రాష్ట్రంలోని హిస్సార్ జిల్లాలో జన్మించారు. సాధారణ రైతు కుటుంబంలో పెరిగిన ఆయన పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు ప్రతిభ కనబరిచి ముందుకు సాగారు. 1981లో డిగ్రీ పూర్తి చేసిన ఆయన 1984లో రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్సిటీ నుంచి న్యాయ శాస్త్ర పట్టా పొందారు. అదే సంవత్సరం హిస్సార్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా పనిచేయడం ప్రారంభించారు. 1985లో పంజాబ్-హరియాణా హైకోర్టుకు మారి ప్రముఖ న్యాయవాదిగా నిలిచారు. 2001లో సీనియర్ అడ్వకేట్ హోదా పొందారు.

**అడ్వకేట్ జనరల్ నుంచి హైకోర్టు జడ్జిగా**

హరియాణా అడ్వకేట్ జనరల్‌గా పనిచేసిన జస్టిస్ సూర్యకాంత్ 2004 జనవరి 9న పంజాబ్-హరియాణా హైకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. 2018 అక్టోబర్ 5న హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులై పరిపాలనా, న్యాయ వ్యవస్థలో వినూత్న నిర్ణయాలకు గుర్తింపు పొందారు. తరువాత 2019 మే 24న ఆయన సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఐదు సంవత్సరాల పాటు సుప్రీంకోర్టులో పనిచేసిన ఆయన పలు కీలక రాజ్యాంగ, సామాజిక బాధ్యతలకు సంబంధించిన కేసుల్లో తీర్పులు ఇచ్చారు.

**కీలక తీర్పులలో కీలక పాత్ర**

జస్టిస్ సూర్యకాంత్ పలు సంచలనాత్మక తీర్పుల్లో భాగస్వామ్యం వహించారు. ఆర్టికల్ 370 రద్దు కేసుపై ఇచ్చిన చారిత్రక తీర్పులో సభ్యుడిగా ఉన్నారు.

వాక్ స్వాతంత్ర్యం, అవినీతి వ్యతిరేక చర్యలు, పర్యావరణ పరిరక్షణ, బిహార్ ఓటర్ల జాబితా తదితర అంశాల్లో ఆయన తీర్పులు ప్రస్తావనీయమైనవి. మహిళలకు న్యాయరంగంలో అవకాశాలు పెంచే పలు ప్రముఖ సూచనలు చేశారు. ఖైదీల వ్యక్తిగత హక్కుల పరిరక్షణకు సంబంధించిన తీర్పులతో ఆయన ప్రగతిశీల ధోరణి స్పష్టమైంది.

**నూతన సీజేఐపై న్యాయవర్గం ఆశలు**

జస్టిస్ సూర్యకాంత్ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో న్యాయ వ్యవస్థలో సంస్కరణలు, పెండింగ్ కేసుల పరిష్కారం, న్యాయ ప్రాప్యత విస్తరణ వంటి అంశాల్లో ఆయన నుంచి విశేష చర్యలు ఉంటాయని న్యాయవర్గం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. గ్రామం నుంచి సుప్రీంకోర్టు శిఖరానికి ఎదిగిన ఆయన ప్రయాణం దేశంలో అనేక యువ న్యాయవాదులకు ప్రేరణగా నిలుస్తోంది.

## చండీగఢ్‌పై ఏ నిర్ణయం తీసుకోలేదు



**మొదటిపేజీ తరువాయి**

కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేసిన ప్రతిపాదన దేశవ్యాప్తంగా, ముఖ్యంగా పంజాబ్‌లో పెద్ద రాజకీయ చర్చకు దారితీసింది. చండీగఢ్‌పై కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం అక్కడి రాజకీయ పార్టీలన్నీ ఒకే స్వరంతో వ్యతిరేకిస్తుండడంతో, కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఈ అంశంపై అధికారికంగా స్పందించింది.

**బిల్లుపై ఇంకా తుది నిర్ణయం లేదు-కేంద్రం**

రాజ్యాంగ అధికరణం 131ను సవరించి, చండీగఢ్‌లో చట్టాలు చేసే పూర్తి అధికారాన్ని రాష్ట్రపతి పరిధిలోకి తీసుకురావాలని కేంద్రం పరిశీలిస్తున్నప్పటికీ, ఈ ప్రతిపాదనపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని హోంమంత్రిత్వ శాఖ తెలిపింది. అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేసిన ప్రకటనలో, "చండీగఢ్‌కు చట్టాలను అమలు చేయడం మరియు వాటిని సులభతరం చేయడం కోసం కొన్ని మార్పులను పరిశీలిస్తున్నాం. కానీ ఈ ప్రతిపాదన చండీగఢ్ పరిపాలన లేదా పంజాబ్, హరియాణా రాష్ట్రాల మధ్య ఉన్న సంబంధాలను ప్రభావితం చేసే ఉద్దేశంతో తీసుకురాలేదు. చండీగఢ్ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, సంబంధిత పక్షాలన్నింటితో చర్చించిన తరువాతే తుది నిర్ణయం తీసుకుంటాం'' అని స్పష్టం చేసింది. అలాగే రాబోయే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టే ప్రణాళిక ప్రస్తుతం లేదని కూడా పేర్కొంది.

**ఎందుకు వివాదం? పంజాబ్ పార్టీల ఆగ్రహం**

చండీగఢ్‌ను రాజ్యాంగ అధికరణం 240 పరిధిలోకి తీసుకురావడం ద్వారా కేంద్రం నేరుగా చట్టాలు చేయగల అవకాశాన్ని పెంచుతుంది. ప్రస్తుతం చండీగఢ్ పంజాబ్ మరియు హరియాణా రాష్ట్రాల సంయుక్త రాజధానిగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో చండీగఢ్ 'కేంద్రాధీన పరిపాలన' మరింత బలపడుతుందనే ఆందోళనతో పంజాబ్ రాజకీయ పార్టీలు ఈ ప్రతిపాదనకు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

**పంజాబ్ రాజకీయ నేతల ఆగ్రహం — "చండీగఢ్ మా హక్కు"**

పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, పంజాబ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అమరీందర్ సింగ్ రాజా తదితరులు కేంద్ర ప్రతిపాదనపై విశేషంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

**వారి ఆరోపణల ప్రకారం**

బీజేపీప్రభుత్వం చండీగఢ్‌ను పంజాబ్ నుంచి పూర్తిగా తీసుకుపోయేందుకు ప్రయత్నిస్తోంది''. చండీగఢ్ మా చారిత్రక హక్కు... రాజధానిని లాక్కోవడానికి కేంద్రం చర్యలు మొదలుపెట్టింది''** అని నేతలు తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ బిల్లును ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్, అకాలీదళ్ యావత్తూ వ్యతిరేకిస్తూ, పంజాబ్ హక్కులు దెబ్బతిన్నాయని ఆరోపిస్తున్నాయి. పంజాబ్ అసెంబ్లీ కూడా గతంలో చండీగఢ్‌ను పూర్తిగా పంజాబ్‌కు ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసిన విషయం గుర్తుచేస్తున్నారు. కేంద్రం స్పష్టత తెచ్చినా వివాదం కొనసాగుతూనే కేంద్రం "బిల్లుకు ఇంకా తుది నిర్ణయం లేదు... చర్చల తరువాతే ముందుకు వెళ్తాం'' అని ప్రకటించినప్పటికీ, పంజాబ్‌లో ప్రతిపక్షం, అధికార పార్టీలు మొత్తం ఈ ప్రతిపాదనను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ అంశం దేశ రాజకీయాల్లో మరింత చర్చకు దారి తీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ సమ్మిట్



**మొదటిపేజీ తరువాయి**

ఆతిథ్యం, కమ్యూనికేషన్ సేవలను అత్యంత సమగ్రంగా సిద్ధం చేయాలని అధికారులు సూచించారు. ప్రతి విభాగం సమన్వయంతో పనిచేసి సమ్మిట్‌ను విజయవంతం చేయాలని సీఎం ఆదేశించారు.

సమ్మిట్ ప్రాంతంలో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయాలని, అనుమతులు లేని వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రవేశపెట్టరాదని సీఎం స్పష్టం చేశారు. పాస్‌లు, ప్రాప్యత నియంత్రణ వంటి అంశాలను కఠినంగా అమలు చేయాలని భద్రతా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్రాన్ని పెట్టుబడుల కేంద్రంగా మార్చాలన్న లక్ష్యంతో జరుగుతున్న ఈ సమ్మిట్ తెలంగాణ అభివృద్ధికి ఒక కీలక వేదికగా నిలుస్తుందని ముఖ్యమంత్రి నమ్మకం వ్యక్తం చేసినట్లు అధికారులు తెలిపారు.

# భాగ్యనగరానికి పటేల్ గొప్పసేవ

- **ఆయన కంటే గొప్పగా చేసినవారెవరూ లేరు**
- **రజాకార్ల హత్యాకాండ నుంచి విముక్తి కల్పించారు**
- **యూనిటీ మార్చ్‌లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**ప్రజాస్వరం, హైదరాబాద్:**




తెలంగాణకు, హైదరాబాద్ సంస్థానానికి సర్దార్ పటేల్ కంటే గొప్పసేవ చేసిన నాయకుడు మరొకరు లేరని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కొనియాడారు. సికింద్రాబాద్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా నిర్వహించిన యూనిటీ మార్చ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలోని 4 కోట్ల ప్రజలు తమ హృదయాల్లో నిలుపుకోవాల్సిన వారిలో మొదటి వరుసలో నిలిచే వ్యక్తి భారత ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేలేనని కొనియాడారు. ఆ రోజుల్లో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో రజాకార్లు సాగించిన హత్యాకాండ, వేలాది మంది హిందువులపై జరిగిన దారుణాలు, మహిళలపై అమానవీయ వేధింపులు చరిత్రకు తెలిసిన వాస్తవాలని ప్రస్తావించారు. ఆ దుస్థితి నుంచి విముక్తి కల్పించిన మహానుభావుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కిషన్ రెడ్డి స్మరించుకున్నారు. ఆపరేషన్ పోలో ద్వారా హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో ఐక్యం చేసి, మన తెలంగాణకు నిజమైన స్వేచ్ఛను అందించిన నాయకుడు ఆయనేనని ప్రశంసించారు. దేశ నిర్మాణంలో కూడా సర్దార్ పటేల్ అపూర్వమైన పాత్ర పోషించారన్నారు. స్వాతంత్ర్యం అనంతరం చిన్నచిన్న సంస్థానాలను, వందలాది రాజ్యాలను ఒకే భారతదేశంగా ఐక్యం చేసిన నాయకత్వం సర్దార్ పటేల్‌దేనని పొగిడారు. సాంస్కృతికంగా, ధార్మికంగా, భౌగోళికంగా ఎన్నో భిన్నత్వాలు ఉన్న దేశాన్ని ఐక్య భారతంగా తీర్చిదిద్దిన మహానుభావుడు అని కొనియాడారు. అందుకే పటేల్ 150వ జయంతిని తెలంగాణలోని ప్రతి గ్రామంలో, ప్రతి పాఠశాలలో, ప్రతి కార్యాలయంలో ఘనంగా నిర్వహించుకోవడం అందరి బాధ్యత అని కిషన్ రెడ్డి సూచించారు.



# సత్యసాయి సేవలు మార్గదర్శకం

- **జీవితాంతం కార్యరూపంలో మానవసేవను ఆదర్శించారు**
- **ఆయన బోధనలు అందరూ ఆదర్శంగా తీసుకోవాలి**
- **సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు**

**ప్రజాస్వరం, హైదరాబాద్:**

శ్రీ సత్యసాయి బాబా మానవాళికి అందించిన సేవలు, బోధనలు, ఆధ్యాత్మిక సందేశం యుగయుగాల పాటు నిలిచే మార్గదర్శకంగా ఉంటాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని హిల్‌వ్యూ స్టేడియంలో శ్రీ సత్యసాయి శతజయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగగా, ముఖ్యమంత్రి ప్రత్యేక ఆహ్వానితుడిగా పాల్గొని సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "సత్యసాయి బాబా మానవత్వాన్ని దేవత్వంతో కలిపిన మహానుభావుడు. సాధారణ మనుషుల్లో దేవత్వాన్ని గుర్తించి, ప్రేమ, సేవల ద్వారా ప్రపంచానికి చూపించారు. ఆయన మానవ సేవే మాధవ సేవ అని చెప్పడమే కాదు, ఆ మాటను తన జీవితాంతం కార్యరూపంలో చూపించి ఆదర్శాన్ని నిలబెట్టారు'' అని ముఖ్యమంత్రి ప్రశంసించారు.

**ఎడ్యుకేషన్, హెల్త్, డ్రింకింగ్ వాటర్ రంగాల్లో ప్రపంచానికే ఆదర్శం**

సత్యసాయి బాబా నడిపిన సేవా కార్యక్రమాలు ప్రభుత్వాలు చేయలేని స్థాయి పనులను పూర్తి చేశాయని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. "కేజీ నుంచి పీజీ వరకు లక్షలాది పేద పిల్లలకు పూర్తిగా ఉచిత విద్యను అందించడం ఓ మహోన్నత కార్యం. చివరి దశలో ఉన్న పేద రోగులకు అత్యంత ఖరీదైన వైద్యసేవలను ఉచితంగా ఇవ్వడం ద్వారా వేలాది ప్రాణాలను రక్షించారు. పాలమూరు వంటి వలస సమస్యలు వేధించిన జిల్లాలకు తాగునీటి సదుపాయం కల్పించి జీవన ప్రమాణాలను మార్చారు. కేవలం ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు, తమిళనాడులో కూడా తాగునీటి సమస్యను ముగించే పనులు సత్యసాయి ట్రస్టు చేసింది'' అని ఆయన వివరించారు.

**140 దేశాల్లో భక్తులు – ప్రపంచవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు**

సత్యసాయి బాబా బోధనలు సరిహద్దులు దాటి ప్రపంచవ్యాప్తంగా వ్యాపించాయని ముఖ్యమంత్రి అన్నారు. "ఈ రోజు 140 దేశాల్లో సత్యసాయి భక్తులు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వారి సేవా భావన ప్రపంచానికి ప్రేరణ. ప్రేమ ద్వారా ఏది సాధించలేమో అటువంటి విషయం లేదని సత్యసాయిబాబా తన జీవితం ద్వారా నిరూపించారు. ఆయన ప్రేమతో మనుషులను గెలిచారు, సేవలతో దేవుడిగా హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించారు'' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వేడుకల్లో పాల్గొనే అవకాశాన్ని జీవితంలో విశేషమైన క్షణంగా భావిస్తున్నానని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరూ సత్యసాయి బాబా ఆలోచనలు, బోధనలు స్ఫూర్తిగా తీసుకుని మానవత్వంతో నిండిన సమాజ నిర్మాణంలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## నత్తనడకన టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణం



**మొదటిపేజీ తరువాయి**

నెల రోజులు దాటిపోయినా, అక్కడ ఒక్క బెడ్ కూడా ప్రారంభం కాలేదు. నిర్మాణ పనులు ఎక్కడా కనిపించడం లేదు" అని విమర్శించారు. అంతేకాకుండా, గత రెండు సంవత్సరాలుగా టిమ్స్ ఆసుపత్రులను ప్రారంభించే తేదీలను ప్రభుత్వం వరుసగా మార్చుకుంటూ ప్రజలను మభ్యపెడుతోందని ఆయన ఆరోపించారు. సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణాలు చాలా నెమ్మదిగా సాగుతున్నాయని, పనుల ప్రగతి పూర్తిగా నిలిచిపోయినట్లే ఉందని హరీశ్ రావు పేర్కొన్నారు.

ప్రభుత్వం భూముల అమ్మకాలపై చూపుతున్న ఆసక్తి, ప్రజలకు అవసరమైన వైద్య సేవల అభివృద్ధిపై మాత్రం కనిపించడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. *"టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణం పూర్తయితే మాజీ సీఎం కేసీఆర్‌కు మంచి పేరు వస్తుంది. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఈ పనులను అంతగా ముందుకు తీసుకురావడం లేదు"* అని హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని గమనించి తగిన తీర్పు ఇవ్వాలని ఆయన కోరారు.

## మరికొంత గడువు ఇవ్వండి

- **స్పీకర్‌కు ఎమ్మెల్యే దానం లేఖ**
- **వివరణకు అదనపు గడువుకు విజ్ఞప్తి**
- **ఇప్పటికే రెండుసార్లు స్పీకర్ నోటీసులు**

**ప్రజాస్వరం, హైదరాబాద్:**



పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్పీకర్‌కు తన వివరణ ఇచ్చేందుకు మరింత సమయం కోరారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జారీ చేసిన నోటీసుల గడువు ఆదివారం నాడు ముగిసింది. దీంతో, మరికొంత గడువు ఇవ్వాలంటూ స్పీకర్ నోటీసులకు ఎమ్మెల్యే దానం స్పందించారు. ఈ మేరకు స్పీకర్‌కు ఆయన లేఖ రాశారు. దానం లేఖను స్పీకర్ గడ్డం ప్రసాద్ పరిశీలించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేల్లో ఇప్పటికే 8 మంది ముందు హాజరై వివరణ ఇచ్చారు. కడియం శ్రీహరి, దానం నాగేందర్ మాత్రమే వివరణ ఇవ్వాల్సి ఉంది. కడియం శ్రీహరి కూడా వివరణ ఇచ్చేందుకు అదనపు సమయం ఇవ్వాలంటూ స్పీకర్‌ను కోరారు. వీరిద్దరు ఎమ్మెల్యేలు ఏమని వివరణ ఇస్తారు?, ఎప్పుడు స్పందిస్తారు?, ఇంకేమైనా వ్యూహాలు ఉన్నాయా? అనేది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# జీ 20 వేదికగా డిజిటల్ ఉద్యమం

**మొదటిపేజీ తరువాయి**

మూడు దేశాల మధ్య డిజిటల్ పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌లో కొత్త మార్గదర్శకాలను ఏర్పరచడం. ఇందులో భాగంగా యూపీఐ, కోవిన్, డిజిటల్ ఐడెంటిటీ సిస్టమ్స్ వంటి ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందిన భారత డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను పంచుకునే అవకాశాలను పరిశీలించనున్నారు. అంతేకాక, సైబర్ సెక్యూరిటీ రంగంలో సమిష్టి చర్యలు, ప్రామాణిక విధానాలు, సంయుక్త శిక్షణ వ్యవస్థలపై కూడా విస్తృతంగా చర్చ జరిగింది. భారత విదేశాంగశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ అలయన్స్ అభివృద్ధి చెందుతున్న దేశాలకు డిజిటల్ మౌలిక వసతుల నిర్మాణంలో గణనీయమైన మద్దతు అందించగలదని భావిస్తున్నారు. ముఖ్యంగా ఫిన్‌టెక్, హెల్త్‌టెక్, ఈగవర్నెన్స్ రంగాల్లో ఇది కీలక వేదికగా మారనుంది. సమావేశంలో ఇబ్సా నిధి అంశం కూడా చర్చకు వచ్చింది. ఈ నిధితో ఇప్పటి వరకు 40 దేశాలలో విద్య, వైద్యం, మహిళా సాధికారత, సౌర విద్యుత్తు వంటి అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయబడుతున్నాయి. మోదీ ఈ కార్యక్రమాల పురోగతిని అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని దేశాలకు ఈ నిధి సేవలు విస్తరించాలనే అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ సంస్థల సంస్కరణ అంశాన్ని కూడా ప్రధాని మోదీ ఘాటుగా ప్రస్తావించారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి వంటి ప్రపంచస్థాయి సంస్థలు ప్రస్తుత గ్లోబల్ వాస్తవాలను ప్రతిబింబించేలా పునర్వ్యవస్థీకరణ అవసరమని, ఇబ్సా ఈ సంస్కరణలకు గొంతుకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ ప్రగతిని పంచుకునే ఈ కొత్త అలయన్స్ ద్వారా మూడు దేశాలు మాత్రమే కాదు, మూడో ప్రపంచ దేశాలన్నీ ప్రయోజనం పొందే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.



## ఆగింది ఐబొమ్మే.. పైరసీ కాదు

**మొదటిపేజీ తరువాయి**




మూవీరూల్జ్ సైట్ లో తాజా సినిమాలన్నీ ప్రత్యక్షమయ్యాయి. థియేటర్లలో వీడియో కెమెరాతో రికార్డు చేసి ఈ సైట్ లో అప్ లోడ్ చేసినట్లు తెలుస్తోంది. తాజా సినిమాలు అల్లరి హీరోగా వచ్చిన 12ఏ రైల్వే కాలనీతో పాటు సంతాన ప్రాప్తిరస్తు, రాజు వెడ్స్ రాంబాయి, ప్రేమంటే సినిమాలు మూవీరూల్జ్ సైట్ లో కనిపిస్తున్నాయి. విడుదలైన ఒక్కరోజులోనే సినిమాలు పైరసీ సైట్ లో ప్రత్యక్షం కావడంతో నిర్మాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## యూనిటీ మార్చ్ కు రమేష్ కట్టర్ హిందూ ఎంపిక



సిద్దిపేట రూరల్, నవంబర్ 23(ప్రజాస్వరం)

భారత ఉక్కు మనిషి, సర్దార్ వల్ల భాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఏడాది పొడవునా ఉత్సవాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.. దీనిలో భాగంగా దేశం నలుమూలల నుంచి ఎంపిక చేసిన యువ ప్రతినిధులతో వారం రోజుల పాటు 'యూనిటీ మార్చ్' కార్యక్రమాన్ని కేంద్రం చేపడుతోంది. ఈ ప్రతిష్ఠాత్మక యాత్రకు సిద్దిపేట జిల్లా నుంచి సిద్ధిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన గణగోని రమేష్ కట్టర్ హిందూ ఎంపికయ్యారు. ఈ 'యూనిటీ మార్చ్' హైదరాబ్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ నుంచి ప్రారంభం అయింది. అక్కడి నుంచి నాగపూర్ ఇండోర్ మీదుగా గుజరాత్ లోని చారిత్రక 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' (ఐక్యతా విగ్రహం) వరకు వేలాది మంది యువ ప్రతినిధులతో కలిసి ఈ ఐక్యతా యాత్ర సాగుతుంది. ఈ సందర్భంగా గణగోని రమేష్ కట్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం ముక్కలుగా ఉన్న దేశాన్ని 562 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి దేశ ఐక్యతకు కృషి చేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో దేశమంతా ఐక్యతగా ఉండాలని ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. యాత్ర ముగింపు కార్యక్రమానికి భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారు ముఖ్య అతిథిగా హాజరై దేశ ప్రజలకు ఐక్యతా సందేశాన్ని ఇస్తారని రమేష్ కట్టర్ హిందూ తెలిపారు.గతంలో విద్యార్థి నాయకునిగా విద్యార్థుల సమస్యలపై ఉద్యమించి, ప్రస్తుతం యువమోర్చాలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న తనను ఈ యూనిటీ మార్చ్ కి ఎంపిక కావడం ఒక అరుదైన గౌరవంగా భావిస్తున్నానని అన్నారు ఈ కార్యక్రమానికి సిద్దిపేట జిల్లా నుంచి తనను ఎంపిక చేసినందుకు గాను కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.జిల్లా నుండి తనను ఎంపిక చేసిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు గారికి, జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ గారికి యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కుండే గణేష్ గారికి కృతజ్ఞతలు తెలిపారు

# సత్యసాయి సేవలు అజరామరం

- **సర్వ మానవాళికి ఆదర్శప్రాయులు**
- **సుజాతనగర్ లో ఘనంగా 100 వ జన్మదిన వేడుకలు**
- **నిరుపేదలకు కుట్టు మిషన్లు రగ్గులు పంపిణీ**

**సుజాతనగర్,నవంబర్ 23(ప్రజాస్వరం):**

ప్రపంచ మానవాళికి సత్యసాయి ఆదర్శప్రాయులనీ పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు కొనియాడారు.. సుజాతనగర్ శ్రీ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం 100 వ జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ సత్యసాయి సేవలు అజరామరం అన్నారు.శ్రీ సత్యసాయి సేవా ట్రస్టుల ద్వారా ప్రపంచవ్యాప్తంగా లక్షలాదిమందికి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఉచిత విద్య వైద్యంతోపాటు వేలాది గ్రామాలకు మంచినీరు అందించిన ఘనత కూడా సత్య సాయిబాబా కి దక్కుతుందన్నారు.దేశ విదేశాల్లో సాయిబాబాకు లక్షలాదిమంది భక్తులు ఉన్నారని వారందరూ కూడా నిరంతరం అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు అన్నారు.. అలాగే సుజాతనగర్ సత్యసాయి భజన మండలి కూడా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి ఈ ప్రాంత ప్రజలకు ఆధ్యాత్మిక భక్తి భావం పంచడం తోపాటు నిరుపేదలకు ఆపన్న హస్తము అందిస్తుంది అన్నారు.భజన మండలి సభ్యులను ఈ సందర్భంగా రమేష్ బాబు అభినందించారు. ఉదయం నగర సంకీర్తన తో ప్రారంభమైన 100 వ జన్మదిన వేడుకలు లో భాగంగా సహస్రనామ పూజ,దంపతుల పూజ నిర్వహించారు, అలాగే ఇద్దరు మహిళలకు కుట్టు మిషన్లు,అనాథ ఆశ్రమ విద్యార్థులకు రగ్గులు పంపిణీ ప్రసాద వితరణ,వేలాది మంది భక్తులకు అన్న



సమారాధన తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు 95వ వార్డ్ కార్పొరేటర్ ముమ్మన దేముడు,మెంటి మహేశ్, సత్యసాయి భక్త బృందం గౌరవ అధ్యక్షులు,జాతీయ జర్నలిస్టులు సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు ఆలయ కమిటీ సభ్యులు హెచ్.బుజ్జిబాబు,ప్రమీల, బి.జ్యోతి,ముక్క గోపి,పి తాతారావు,సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



## చర్లపల్లి డివిజన్‌లో అక్రమ నిర్మాణాల జోరు

**కాప్రా,నవంబర్ 23(ప్రజాస్వరం):**

చర్లపల్లి డివిజన్ పరిధిలో ఇటీవలి గత కొన్ని నెలలుగా అక్రమ నిర్మాణాలు విస్తరించడం స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా నేతాజీ నగర్ కాలనీ, లక్ష్మీ నగర్,సమీప ప్రాంతాల్లో అనుమతులు లేకుండా పెచ్చరిల్లిన నిర్మాణాలపై స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వం క్రమబద్ధీకరణ చర్యలు చేపడుతుంటే, కొంతమంది నిర్మాణదారులు నియమాలను పట్టించుకోకుండా భవనాలను ఎత్తుకు ఎత్తి నిర్మిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇలా అనధికారిక నిర్మాణాలు పెరగడంతో రోడ్ల విస్తరణ, పార్కింగ్ సదుపాయాలు, పారిశుద్ధ్యం వంటి అంశాలు తీవ్రమైన ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. వాటర్ సప్లై, డ్రైనేజ్ కనెక్షన్లు లేకపోయినా, కొన్ని భవనాలు నిర్మాణ దశలోనే వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించడం స్థానికుల్లో విస్తృత అసంతృప్తిని రేకెత్తిస్తోంది. కాలనీ ప్రతినిధులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా, పెద్దగా స్పందన రాలేదని వారు పేర్కొన్నారు. నిర్మాణాల పర్యవేక్షణ బాధ్యత ఉన్న శాఖలు కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజల్లో పెరుగుతున్న అసహనాన్ని తగ్గించాలని నివాసితులు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలు నియంత్రించకపోతే భవిష్యత్తులో పెద్ద సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.





## చిన్నారి సిశిరా హృదయాన్ని హత్తుకున్న బర్త్‌డే గిఫ్ట్

**ఉప్పల్,నవంబర్ 23(ప్రజాస్వరం):**

పుట్టినరోజు సందర్భంగా చిన్నారి ఇడపాక సిశిరా చూపించిన బాధ్యతాయుతమైన ఆలోచన అందరినీ ఆకట్టుకుంది.శనివారం తన పుట్టినరోజు సందర్భంగా తల్లికి చేతి గడియారం,నాన్నకు హెల్మెట్‌ను స్వంతంగా దాచుకున్న డబ్బులతో కొనిచ్చి తల్లిదండ్రులపై ఉన్న ప్రేమను చాటుకుంది. నాన్న భద్రత కోసం ప్రేమతో అందించిన ఈ హెల్మెట్ చూసి తల్లిదండ్రులు ఇడపాక సునీత, సురేష్ హర్షం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే భద్రతపై ఇంత అవగాహన చూపిన సిశిరాను బంధువులు,స్నేహితులు, శ్రేయోభిలాషులు అభినందిస్తూ పాపకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



## యాపర్ల మాజీ సర్పంచ్ మందాడి రామకృష్ణారెడ్డి మృతి.

**వనపర్తి ప్రతినిధి,నవంబర్ (ప్రజాస్వరం):**

పెబ్బేరు మండలం యాపర్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మందాడి రామకృష్ణారెడ్డి వయోభారంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. ఎన్టీఆర్ హయాంలో తెలుగుదేశం పార్టీ తరపున చురుకుగా కొనసాగుతూ గ్రామానికి సర్పంచ్ గా ఎన్నికై అవినీతి రహిత పాలన చేశాడని గ్రామస్తులు గుర్తు చేశారు. రామకృష్ణారెడ్డికి తన సతీమణి మరణించగా ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.వ్యవసాయమే ఆధారంగా జీవనం సాగించే ఆయనకు పశుపోషకులుగా మంచి పేరుంది.ఒంగోలు జాతి పశువులను పెంచి పోషించడంలో ఆయన ప్రముఖ పాత్ర వహించేవారు. గ్రామంలో అందరితో కలుపుగోలుగా ఉండే ఆయన వయో భారంతో మృతి చెందడం గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. రామకృష్ణారెడ్డిని కడసారి చూసేందుకు వనపర్తి మాజీ శాసనసభ్యులు రావుల చంద్రశేఖర రెడ్డి, అలంపూర్ మాజీ శాసనసభ్యులు రావుల రవీంద్రనాథ్ రెడ్డిలు హాజరై రామకృష్ణారెడ్డి పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.కార్యక్రమంలో గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుగ్గిళ్ళ రామ్ రెడ్డి పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలతో మండ సురేష్ పుట్టినరోజు

**కాప్రా,నవంబర్ 23(ప్రజాస్వరం):**

కాప్రా మున్సిపల్ పరిధిలోని ఇ.సి.ఐ.ల్ సౌత్ కమలానగర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండ సురేష్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పారిశుద్ధ కార్మికులకు దుప్పట్లు, కుట్టు వృత్తి చేసుకునే మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. పుట్టినరోజు సందర్భంగా విశ్వకర్మ ట్రస్ట్ భవన అభివృద్ధి కోసం రూ.2,22,222 చెక్కును మండ సురేష్ ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు. సామాజిక సేవలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన తెలిపారు.కార్యక్రమానికి లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇన్నారెడ్డి, రెండవ గవర్నర్ కళ్లెం కృష్ణారెడ్డి, స్థానిక కార్పొరేటర్ శిరీష సోమశేఖర్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని రెడ్డి,రవికుమార్ యాదవ్,కాసం మైపాల్ రెడ్డి, రాఘవరెడ్డి,కనుకుల రజనీకాంత్ రెడ్డి,దత్తు పెంటయ్యగౌడ్,జనార్ధన్ తదితరులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. లయన్స్ క్లబ్ సభ్యులు, స్థానిక నాయకులు,కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్,ప్రతినిధులు ,కాలనీ వాసులు,పారిశుద్ధ కార్మికులు భారీగా పాల్గొన్నారు.





## వన్డే సారథిగా కేఎల్ రాహుల్

**మొదటిపేజీ తరువాయి**

గాయం కారణంగా సిరీస్‌కు దూరమయ్యాడు. మరోవైపు, రెగ్యులర్ వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా గాయం కారణంగా ఆస్ట్రేలియాలో శస్త్రచికిత్స చేయించుకుని, చికిత్స పొందుతున్నందున అతడు కూడా అందుబాటులో లేడు. దీంతో, తాత్కాలిక కెప్టెన్‌గా సీనియర్ ప్లేయర్ కేఎల్ రాహుల్‌ను సెలక్టర్లు ఎంపిక చేశారు. రిషభ్ పంత్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేసే అవకాశం ఉన్నా, అతడు ఏడాదికి పైగా ఒక్క వన్డే మ్యాచ్ కూడా ఆడకపోవడంతో కేఎల్ రాహుల్ వైపు సెలక్టర్లు మొగ్గుచూపారు. జట్టు విషయానికి వస్తే, భారత స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలకు కూడా జట్టులో చోటుదక్కింది. గిల్ అందుబాటులో లేకపోవడంతో రోహిత్‌తో కలిసి యశస్వి జైస్వాల్ ఓపెనర్‌గా ఎంపికయ్యాడు. దేశవాళీ క్రికెట్‌లో, ఇండియాఎ తరపున ఆడుతూ అద్భుతమైన ఫామ్‌లో ఉన్న రుతురాజ్ గైక్వాడ్‌ను రిజర్వ్ ఓపెనర్‌గా సెలక్ట్ చేశారు. జట్టు ఎంపికలో మరో విశేషం ఏంటంటే, ఆస్ట్రేలియాతో జరిగిన 3 వన్డేల సిరీస్‌లో చోటుదక్కని ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా తిరిగి జట్టులోకి వచ్చాడు. ఆస్ట్రేలియా పర్యటనలో ఆడిన సీనియర్



పేసర్లు మహ్మద్ సిరాజ్, జస్ప్రీత్ బుమ్రాలకు విశ్రాంతిని ఇచ్చారు. ప్రసిద్ధ్ కృష్ణను జట్టులోకి తీసుకున్నారు. హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్‌తో కలిసి పేస్ బౌలింగ్‌ను నడిపించనున్నారు. ఇక, సీనియర్ పేసర్ మహ్మద్ షమీని మరోసారి సెలక్టర్లు విస్మరించారు. స్పిన్ విభాగం విషయానికి వస్తే, వరుణ్ చక్రవర్తిని సెలక్టర్లు పక్కనపెట్టారు. జడేజా, కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్ ముగ్గురూ స్పిన్ కోటాలో జట్టులో ఉంటారు.

**భారత వన్డే జట్టు ఇదే**

రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, తిలక్ వర్మ, కేఎల్ రాహుల్ (కెప్టెన్, వికెట్ కీపర్), రిషభ్ పంత్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, రుతురాజ్ గైక్వాడ్, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, ధ్రువ్ జురెల్.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణి చేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

- **ఇల్లందు టౌన్,మండలం కలిపి 72 మంది లబ్ధిధారులకు 22,49000 రూ" విలువైన చెక్కులు ఎమ్మెల్యే పంపిణి...**

**ఖమ్మం,నవంబర్ 23 (ప్రజాస్వరం):**

ఈ రెండు సంవత్సరాల ప్రజా ప్రభుత్వ కాలంలో 8 కోట్ల విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఇల్లందు నియోజకవర్గంలో పంపిణి చేసాంఎమ్మెల్యే కనకయ్య నాటి కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి హయంలో పేదల వైద్యం చేయించుకుంటే వారికి ఆర్థికంగా నిలిచేందుకు ఈ చెక్కుల పంపిణి ప్రారంభించాం.గత పాలకుల హయంలో రేషన్ కార్డు ఊసే లేదు కాని ప్రజా ప్రభుత్వం లో పేదలందరికి రేషన్ కార్డులు అందించాం.ఈదేశంలో పేదలందరికి అండగా నిలిచే పార్టీ.బడుగులకు,బలహీనులకు అసరగా నిలిచే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ.పేదలందరికి వైద్యం ఖర్చు 10 లక్షల అయిన వారికి ఎల్ఓసీ ఇస్తున్నాం.ప్రియతమ నాయకులు రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులందరికి రేషన్ కార్డులు ,ఇందిరమ్మ ఇళ్ళు,ఉచిత బస్సు,ఉచిత విధ్యుత్,500రూ"గ్యాస పధకాలు అందిస్తున్నాం. ప్రజా ప్రభుత్వం గ్రామాలలో మోలిక వసతుల కల్పనకు రోడ్లు,డ్రైనేజ్, నిర్మిస్తున్నాం.రాబోయే ఎన్నికలలో మంచి చేసే ప్రభుత్వాన్ని గెలుపించండి,ఆదరించండి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలందరికీ వైద్యం ఖర్చు భారం కాకూడదని ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయనిధి పేరిట అందజేస్తున్న సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఇల్లందు టౌన్ మండలంకు చెందిన లబ్ధిదారులకు మండలం టౌన్ అధ్యక్షులు పులి సైదులు దొడ్డ డేనియల్ అధ్యక్షతన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులందరికి చెక్కులు పంపిచేసిన ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య వారి వెంట ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మన్ బానోత్ రాంబాబు ఇల్లందు మండలం మాజీ వైస్ ఎంపీపీ మండల రాంమహేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ యదల



పల్లి అనసూర్య, నాయకులు పూనెం సురేందర్, తాటి భిక్షం,మూతి కృష్ణ,మడుగు సాంబమూర్తి,చిల్లా శ్రీనివాస్,పోట్ రవి,మార్కెట్ కమిటి డైరెక్టర్ కుంజా వసంతరావు,మాజీ సర్పంచ్లు కల్తి పద్మ,పాయం స్వాతి, నాయకురాలు బానోత్ శారద,మోకాళ్ళ వెంకటమ్మ,తాటి రాంబాబు, జోగా శ్రీకాంత్ బొల్లి రామారావు,అరెం కిరణ్ తదితరులు పాల్గొన్నారు

# ఊరురా ఇందిరమ్మ చీరల పండగ

- మండల వ్యాప్తంగా ఇందిరమ్మ చీరలు పంపిణీ

దౌల్తాబాద్ నవంబర్ 23( ప్రజాస్వరం ) :





తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీలో భాగంగా మండల వ్యాప్తంగా చీరలు పంపిణీ ప్రారంభమైంది. తిర్మలాపూర్ గ్రామంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పడాల రాములు,ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండారు లాలు గొడుగుపల్లి గ్రామంలో ఉపాధ్యక్షుడు మద్దెల స్వామి,కోనాపూర్ గ్రామంలో టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి గణేష్ పంచమి చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి రెండేండ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంతో పాటు ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని చీరలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.మహిళల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ సర్కార్ అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు.సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందన్నారు.

# మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి

- రామక్కపేటలో 'ఇందిరమ్మ మహిళా శక్తి' చీరల పంపిణీ

దుబ్బాక , నవంబర్ 23 (ప్రజాస్వరం) :



సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల పరిధిలోని రామక్కపేట గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన మహిళా ఉన్నతి-తెలంగాణ ప్రగతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఇందిరా మహిళా శక్తి మహిళా స్వయం సహాయక సంఘం అక్క చెల్లెలకు సీఎం రేవంత్ రెడ్డి అన్న సారె చీరలు కానుకగా కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు,రేకులకుంట మల్లిఖార్జున స్వామి ఆలయ డైరెక్టర్ పెంబర్తి బాలకిషన్, డీసీసీబీ జిల్లా డైరెక్టర్ పూస దశరథం,పంచాయతీ సెక్రెటరీ గౌసోద్దీన్ కలిసి ఈ సందర్భంగా 'ఇందిరమ్మ మహిళా శక్తి' చీరలను మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ఎదగాలని,ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.తెలంగాణ ప్రజా ప్రభుత్వం డిసెంబర్ 9 వరకు 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలను అందజేస్తోందని అన్నారు. గతంలో టి ఆర్ ఎస్ ప్రభుత్వం పంపిణీ చేసిన బతుకమ్మ చీరాల కంటే ఇందిరమ్మ మహిళా శక్తి' ద్వారా నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంకు ఇంచార్జ్ మంత్రికి, మంత్రి సీతక్కకు,దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ లక్ష్మి,కాంగ్రెస్ పార్టీ నాయకులు కోట్టే స్వామి, లాగిశెట్టి నర్సింలు, రాజానర్స్, గ్రామ యూత్ అధ్యక్షులు బరిగే లక్ష్మణ్,బరిగే రాజ్, శ్రీకాంత్, శ్రీనివాస్, మహేష్,సిఏ నాగలక్ష్మి,వివోలు, మహిళలు పలువురు పాల్గొన్నారు.

## మహిళాభివృద్ధికి పెద్దపీట వేసిన

# ప్రజా ప్రభుత్వమిది

- మహిళల ఆత్మ గౌరవమే తమకు ప్రధానం
- కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

మెదక్, నవంబర్ 23 (ప్రజా స్వరం) :



మహిళాభివృద్ధి కి పెద్దపీట వేసిన ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా ముందుకు పోతున్నామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. పాపన్నపేట మండల కేంద్రంలోని, మెదక్ మండలం పాతూరులో, రామాయణపేటలో సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక చేయూతనిస్తూ వారిని ఉన్నత స్థానంలో నిలుపుతామని. మహిళా సంఘాలు నిర్ణయించిన మోడల్ చీరలను పంపిణీకి ఎంపిక చేశామని తెలిపారు. మహిళల ఆత్మ గౌరవమే తమకు ప్రధానమని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలని లక్ష్యంగా ముందుకు పోతున్నామన్నారు. గ్రామ, మండల సమాఖ్య బాధ్యులు చీరల పంపిణీ బాధ్యతను తీసుకొని ప్రతి మహిళకూ చీరలు అందేలా చూడాలని అన్నారు మహిళలు ఐక్యంగా ఉండాలనే సందేశంతో చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఎటువంటి సమస్యలున్నా పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని అన్నారు. మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో వడ్డీ లేని రుణాలకు సంబంధించిన వడ్డీని బ్యాంకులకు ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. రైస్ మిల్లులు, సోలార్ ప్లాంట్లు, క్యాంటీన్లు, పెట్రోల్ బంకుల ఏర్పాటు, బస్సుల కొనుగోలు వంటి వ్యాపారంలో మహిళా సంఘాలకు ప్రభుత్వం తోడ్పాటునిస్తూ వారిని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూస్తోందని అన్నారు. రైతులు పండించిన వరిని బోనస్ ఇచ్చి మరి కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయకుండా ఇక్కడే బియ్యం చేసి పౌరసరఫరాల శాఖ చౌక ధర దుకాణాల ద్వారా నిరుపేదలకు ఒకరికి 6 కిలోల చొప్పున ఉచితంగా సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని, ఈ ఘనత ప్రజా ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా కోత కాలపు పండుగ వేడుకలు

మెదక్, నవంబర్ 23 (ప్రజా స్వరం) :

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్ఐ చర్చ్ మహాదేవాలయంలో ఘనంగా ఆదివారం కోత కాలపు పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తకాలపు పండుగ ను పురస్కరించుకొని భక్తులు తాము పండించిన తొలి పంటలోని దశమ భాగాన్ని ఏసయ్య కు సమర్పించారు. చర్చ్ లో భక్తులు సమర్పించిన కూరగాయలు, పండ్లు, పూల తో అందంగా అలంకరించారు. పలువురు ఆలపించిన ఏసయ్య భక్తిగీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రత్యేక ఆరాధన దైవంతో మోడరేటర్, మెదక్ ఇంచార్జీ బిషప్ రూబెన్ మార్క్ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు దైవ సందేశాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బిషపమ్మ ప్రిస్సిల్లా, ప్రెస్ బీటర్ ఇంచార్జీ శాంతయ్య, గురువులు డేవిడ్, జైపాల్, శ్రీనివాస్, ప్రార్థనల్లో చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, ఫ్రాంక్ జాన్సన్, గెలాన్ చిత్తరంజన్, లిల్లీ గ్రేస్, అరె ప్రభు దాస్, సుశీల్, మాని, సునీల్, కన్నా మిన్న, సురేందర్, వేముల శ్రీనివాస్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.



# మహిళల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



చిన్న శంకరంపేట, నవంబర్ 23 (ప్రజాస్వరం) :

రాష్ట్ర ప్రగతి మహిళల అభివృద్ధి పైనే ఆధారపడి ఉందని ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సాన సత్యనారాయణ అన్నారు ఆదివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో మహిళలకు చీరలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో ఇందిరా గాంధీ స్ఫూర్తితో ఆడపిల్లలకు చీరల పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఏపీఎం రాములు, సీసీ యశోద, నాగరాజు, స్వామి, నాగరాజు, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు సౌజన్య, కార్యదర్శి సంతోష, కోశాధికారి నిర్మల,నాయకులు రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ అరుణ ప్రభాకర్, గోపాల్ రెడ్డి, రాజశేఖర్, శివకుమార్, ప్రభాకర్, మోహన్ నాయక్, రాజాసింగ్, చిరంజీవి, నర్సింలు, వివోఏ లు తదితరులు పాల్గొన్నారు.

# అప్పుల బాధతో ఉరివేసుకుని కూలీ ఆత్మహత్య

దుబ్బాక , నవంబర్ 23 (ప్రజాస్వరం) :



అప్పుల బాధతో ఉరి వేసుకొని కూలీ ఆత్మహత్య చేసుకున్న ఘటనసిద్దిపేట్ జిల్లా దుబ్బాక మండలం ఆకారం గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. దుబ్బాక సీఐ పి.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దప్పు చంద్రం(50) గ్రామంలో కూలి పని చేస్తూ, కుటుంబంతో కలిసి, జీవనం కొనసాగిస్తున్నాడు.గతలో కుటుంబ అవసరాల కోసం కొన్ని అప్పులు చేశాడు. ఇటీవల నాలుగు నెలల క్రితం చేసిన అప్పులు తీర్చేందుకు ఒక ఎకరం భూమిని అమ్మి, కొన్ని అప్పులు తీర్చగా, ఇంకొన్ని మిగిలాయి. దీంతో మిగిలిన అప్పుల గురించి తీవ్రంగా ఆలోచిస్తూ, తనలో తాను బాధపడేవాడు.ఈ క్రమంలో గ్రామ శివారులోని ఒక చెట్టుకు చంద్రం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జరిగిన ఘటన గుర్తించిన స్థానికులు పోలీసులకు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని, పంచనామా నిర్వహించి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం దుబ్బాక వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు వినయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# కొడంగల్ బంద్ స్వచ్ఛందంగా పాటించాలి

**వికారాబాద్, నవంబర్ 23(ప్రజా స్వరం):**



మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలను శంకుస్థాపన చేసిన స్థలంలోనే నిర్మాణం చేయకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కొడంగల్ అభివృద్ధి చేసి ఉంటే మరల పోటీ చేసి గెలవాలని కెడిపి జెఏసి కో కన్వీనర్లు గంటి సురేష్ కుమార్, ఎరన్ పల్లి శ్రీనివాస్, రమేష్ బాబు, ఎస్ ఎం, గౌసన్, రవి నాయక్,బీమరాజులు అన్నారు. ఆదివారం కోడంగల్ లోని వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అప్పాయి పల్లిలో నిర్మించదలచుకున్న మెడికల్ కళాశాల, పాత కోడంగల్ లో ఏర్పాటు చేయనున్న సమీకృత గురుకులాలను తరలించడానికి వ్యతిరేకిస్తూ సోమవారం కేడిపి జేఏసీ ఆధ్వర్యంలో కోడంగల్ బంద్ కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. సోమవారం జరగబోయే స్థానిక ఎన్నికల్లో స్థానిక నాయకులు ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారో ఆలోచించాల్సిన అవసరం ఉందని పాలకపక్షం ఒక తీరైతే ప్రతిపక్షం ఇంత ఉద్యమం జరుగుతున్న ప్రతిపక్ష నాయకులు నోరు విప్పకపోవడం ఆంతర్యం ఏమిటో తెలపాలన్నారు దీనికి తగిన గుణపాఠం ప్రజలు నిర్ణయిస్తారని హెచ్చరించారు. సోమ వారం నిర్వహించే బంద్ కు వ్యాపారస్తులు, విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ నిర్వహించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నిరసన తెలపాలన్నారు. కోడంగల్ పేరు వాడుకుని ఎటువంటి అభివృద్ధి చేయకుండా ఇచ్చినట్టే ఇచ్చి లగచర్లకు తరలించి కోడంగల్ ప్రాంతానికి అన్యాయం చేస్తూ ఇచ్చినట్లు చూయించుకునేందుకు స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేస్తున్న మధ్యాహ్నా భోజన కిచెన్ షెడ్డును ఏర్పాటు చేయడం వల్ల ప్రస్తుతం స్కూళ్లలో కొనసాగుతున్న మధ్యాహ్నా భోజన ఆహార పథకం క్రింద పనిచేస్తున్న మహిళలకు అన్యాయం జరుగుతుంది అని ఇది కూడా ఒకపక్క నష్టమేనని ఎంతోకొంత దీని నుంచి కొంతమందికి బ్రతుకుతెరువు ఉండేదని ప్రజలకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. కోడంగల్ లో ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తున్నామని ఈ ప్రాంత ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. నియోజకవర్గ ప్రజలు రాష్ట్ర ముఖ్యమంత్రి వస్తున్న సభకు దూరంగా ఉండి కోడంగల్ ప్రాంత ప్రజల ఆవేదనలు తెలపాలన్నారు, సోమవారం నిర్వహించే కోడంగల్ స్వచ్ఛంద బంద్ ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



# ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ

- **మహిళల అభివృద్ధి కోసం కృషి చేస్తా**
- **మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు**

**రామాయంపేట, (ప్రజాస్వరం ) :**

గత ప్రభుత్వం 10 సంవత్సరాలు పాలించి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల లోపు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తుందని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మెల్యే రోహిత్ రావు పర్యటించారు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహిళా సంఘాల సభ్యులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం కృషి చేస్తుందని, మహిళలకు ఇచ్చిన హామీ మేరకు చీరల పంపిణీ చేస్తున్నామని, నిరుపేదలు ధనవంతులతో సమానంగా సన్న బియ్యం తినాలని సంకల్పంతో ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తుందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం ఎన్నికలు వచ్చినాయి అంటేనే హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఇంద్ర,టిపిసిసి సభ్యులు చౌదరి సుప్రభాత్ రావు, మాజీ కౌన్సిలర్ లు గజవాడ నాగరాజు ,దేమే యాదగిరి, సుందర్ సింగ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగులు, మాజీ సర్పంచ్ బండారి మహేందర్ రెడ్డి, శివ ప్రసాద్ రావు, అల్లడి వెంకటి,అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## బీసీ రౌండ్ టేబుల్ సమావేశం

# విజయవంతం చేయండి



**దుబ్బాక , నవంబర్ 23 (ప్రజాస్వరం) :**

42% శాతం బీసీ రిజర్వేషన్ అమలు కోసం. తేదీ 27112025. గురువారం రోజున సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని బీసీ సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో. ఆదివారం రోజు నా ఎలక్ట్రానిక్ మీడియా ప్రింట్ మీడియా ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. 42/.శాతం రిజర్వేషన్ అమలు ధ్యేయంగా బీసీ లందరూ ఐక్యంగా ఉద్యమించాలని వారు పిలుపు నియ్యడం జరిగింది . మేమెంతో మాకంత అనే నినాదంతో బీసీలు అందరము ఐక్యంగా ఉద్యమించాలని వారు పిలుపునివ్వడం జరిగింది. ఈనెల 2711 2025 గురువారం రోజు దుబ్బాక పట్టణంలో నిర్వహించే బీసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీ సంఘాల నాయకులు .విద్యార్థి. యువజన బీసీ కుల సంఘాల అధ్యక్షులు. నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఇట్టి కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల బీసీ నాయకులు మరియు జేఏసీ బీసీ సంఘాల నాయకులు ప్రజాప్రతినిధులు మచ్చ. శ్రీనివాస్. పద్మశాలి . పల్లె. వంశీకృష్ణ గౌడ్. దోరగొల్ల .శ్రీకాంత్ యాదవ్. సిద్దిపేట జిల్లా దిశా కమిటీ డైరెక్టర్. సుంకోజి ప్రవీణ్, పర్సా .కృష్ణ,ఐరేని సాయి గౌడ్. పల్లె రమేష్ గౌడ్ తుమ్మ. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## నూతన వధూవరులను

# ఆశీర్వదించిన పద్మా దేవేందర్ రెడ్డి

- **మాజీ ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి**

**రామాయంపేట, (ప్రజా స్వరం) :**

మెదక్ నియోజకవర్గం బిఆర్ఎస్వి నాయకులు మంభోజిపల్లి గ్రామానికి చెందిన గంజి.నవీన్ సోదరుడు వేణుగోపాల్ వివాహం శాంతితో మెదక్ పట్టణంలోని శ్రీ సాయి బాలాజీ గార్డెన్ లో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వివాహానికి మాజీ డిప్యూటీ స్పీకర్ మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు యం. పద్మాదేవేందర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్సీ శేరి.సుభాష్ రెడ్డిలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వీరి వెంట మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్,మెదక్ మండల పార్టీ అధ్యక్షులు యం. అంజయ్య గౌడ్, మాజీ ఎంపీపీ కిష్టయ్య,మాజీ వైస్ ఎంపీపీ మార్గం.ఆంజనేయులు, మంబోజిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ గంజి.ప్రభాకర్ నాయకులు తుమ్మ లక్ష్మీనారాయణ, రాములు,శ్రీధర్ రెడ్డి, యాదగిరి, దోతి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# తాళ్లపల్లిలో చీరల పంపిణీ



- **దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్**

**దుబ్బాక , నవంబర్ 23 (ప్రజాస్వరం) :**

సిద్దిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి మండలం తాళ్లపల్లి గ్రామంలో మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను అందజేసిన దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11 సంవత్సరాలు దేశ ప్రధానిగా పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, భూములు పంచడంతోపాటు అనేక సంస్కరణలు చేపట్టిన ఉక్కు మహిళ, మాజీ ప్రధాని, భారతరత్న శ్రీమతి ఇందిరా గాంధీ పేరుపైన తెలంగాణలోని 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలను తెలంగాణ ప్రజా ప్రభుత్వం అందజేస్తుంది అని తెలిపారు. తెలంగాణ ఆడపడుచులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సారె కానుక అందజేసినందుకు వారికి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిసి అక్బర్, సిఏ పాతూరు స్వప్న, పంచాయతీ సెక్రెటరీ అమరేష్, కూడా వెల్లి దేవస్థానం డైరెక్టర్ వేల్పుల యాదగిరి ముదిరాజ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గడ్డం యాదగిరి, గోపరి లక్ష్మి రమేష్, బొమ్మరపు సుకన్య, ఎల్లం యాదవ్, కందుకూరి బాల్ రాజ్ గౌడ్, పొట్టేల పరుశురాలు, ఫీల్డ్ అసిస్టెంట్ గోపర్ స్వామి పెద్ద ఎత్తున మహిళా సోదరీమణులు పాల్గొన్నారు.

## కోటి మంది మహిళలను

# కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యం



- **రజిత రాజేందర్ రెడ్డి**

**జగదేవ్ పూర్, ప్రజాస్వరం :**

రాష్ట్ర ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో మహిళల కోసం ఉచిత బస్సు సౌకర్యం, బస్సులు, పెట్రోల్ బంకులు, మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణ ద్వారా ఆర్థికంగా వారి కాళ్ల పై వారు నిలబడేందుకు చర్యలు తీసుకుంటున్నదని మాజీ సర్పంచ్ రజిత రాజేందర్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుపతి రెడ్డి పేర్కొన్నారు.ఇందిరా మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా ఆదివారం జగదేవపూర్ మండలం వట్టిపల్లి గ్రామంలో మహిళలకు చీరలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ భాను,సిఏ వెంకటమ్మ, మాజీ ఎంపీటీసీ స్రవంతి శివకుమార్ ,మాజి ఉప సర్పంచ్ మూనీర్, కొండయ్య ,కనుకయ్య,శివ రెడ్డి, ఆశోక్,సిద్ధు,మల్లయ్య,మహిళా సంఘాల నాయకులు గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి హెల్ప్ డెస్క్



**మెదక్, నవంబర్ 23 (ప్రజా స్వరం) :**

మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు హెల్ప్ డెస్క్ ద్వారా మాత్రమే దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమై ఎన్నికల అవగాహన సదస్సులలో అధికారులు పాల్గొంటున్న కారణంగా ఆయా శాఖల అధికారులు ప్రజావాణి కి అందుబాటులో ఉండరని తెలిపారు. ప్రజలందరూ హెల్ప్ డెస్క్ లో ప్రజావాణి దరఖాస్తులు అందజేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించి సహకరించాలన్నారు.

# దుబ్బాకలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**దౌల్తాబాద్ నవంబర్23( ప్రజాస్వరం) :**

మండల పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) చెక్కులను అదివారం దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ప్రభుత్వం ప్రజల అండగా నిలుస్తుందని, అర్హులైన ప్రతి కుటుంబానికి సహాయం అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా బోయిని పోచమ్మకు రూ. 40,500,ఎ. సంగీతకు రూ. 60,000,టి. మంజులకు రూ. 24,500,జి. లావణ్యకు రూ. 36,000 సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో గాజులపల్లి మాజీ సర్పంచ్ అప్పవారు శ్రీనివాస్, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి చేయూత

**గజ్వేల్ నవంబర్ 23 ప్రజస్వరం :**

సిద్ధిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ, ఆర్అండ్అర్ కాలనీ పల్లెపహాడ్ గ్రామానికి చెందిన శివలింగ మల్లేశం 25 అనారోగ్యంతో కొద్ది రోజుల క్రిందట మృతి చెందారు. మృతునికి భార్య, ఆరు నెలల బాబు, తల్లి ఉన్నారు. తండ్రి గత కొన్ని సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న పల్లెపహాడ్,భారతీయ జనతాపార్టీ, నాయకులు మల్లేశం కుటుంబాన్ని పరామర్శించి 5 వేల విలువ గల నిత్యవసర సరుకులు మరియు 50కిలోల బియ్యం వారి కుటుంబానికి అందజేశారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ, బీజేపీ ప్రధానకార్యదర్శి నరసింహ ముదిరాజ్ మాట్లాడుతూ... మల్లేశం మృతి కుటుంబానికి తీరని లోటు ఇంత చిన్న వయసులో అనారోగ్యంతో మృతి చెందడం చాలా బాధాకరం అని తెలిపారు. మృతుని కుటుంబానికి ధైర్యం చెప్పి వారికి అండగా ఉంటామని



భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో భారతీయజనతా పార్టీ యువమోర్చా సోషల్ మీడియా కోకన్వీనర్ సందరి రాజు, శక్తి కేంద్ర సహా ఇన్చార్జి శివలింగ బాలరాజు,మరియు 196, బూత్ అధ్యక్షులు గుప్తా రామకృష్ణ, బిజెపి నాయకులు మడుగురి కరుణాకర్, మడుగురు సురేష్, శివలింగ్ స్వామి శివలింగ్ రామచంద్రం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## లక్షలాది మందికి ఆశా కిరణాలుగా

# సత్యసాయి సేవలు

- **సమానత్వం, శాంతి, సేవ ఆయన సందేశం**
- **జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు**

**మెదక్ నవంబర్ 23 (ప్రజా స్వరం)**

సత్య సాయి 100 వ జయంతి సందర్భంగా ఆదివారం మెదక్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాస రావు సత్య సాయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శ్రీ సత్య సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ద్వారా వేలాది మందికి ఉచిత చికిత్స అందించడం విశేషమని, ఆరోగ్యం, విద్య, సేవ రంగాల్లో ఆయన స్థాపించిన సంస్థలు దేశవ్యాప్తంగా లక్షలాది మందికి ఆశా కిరణాలుగా నిలుస్తున్నాయని అన్నారు. అదే విధంగా, సత్య సాయి భక్తులు అన్ని మతాలకు చెందిన వారు ఉన్నారని, ఆయన బోధనలు మానవ విలువలు, సేవాభావం, సర్వజన హితం మీద ఆధారపడి ఉండటం వల్ల సమాజానికి సమానత్వం, శాంతి, సేవ అనే సందేశాన్ని అందిస్తున్నాయని పేర్కొన్నారు. అయన ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవలను పొందిన ప్రముఖ హీరో కూడా ఉన్నారని అన్నారు. అనంతపూర్ జిల్లాలో దీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను పరిష్కరించడానికి సత్య సాయి వాటర్ ప్రాజెక్ట్ ద్వారా భారీ స్థాయిలో నీటి సరఫరా చేసి లక్షలాది మందికి ఉపశమనం కలిగించడం ఆయన మహోన్నత సేవలో భాగమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, ఆర్ఐ లు రామకృష్ణ, శైలందర్, ఆర్ఎసై లు నరేష్, మహిపాల్, హరీష్ సిబ్బంది పాల్గొన్నారు.








# సైబర్ మోసాల పట్ల జాగ్రత్త

- **జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు**

**మెదక్ నవంబర్ 23 (ప్రజా స్వరం)**

ప్రజలు ఎక్కువగా మోసపోతున్న మూడు ప్రధాన రకాల సైబర్ నేరాలపై జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మాట్లాడుతూ రోజు రోజుకీ సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా వేగంగా పెరుగుతున్నాయని తెలిపారు. చిన్న పొరపాట్లు కూడా పెద్ద ఆర్థిక నష్టాలకు దారితీసే అవకాశం ఉన్నందున ప్రజలు ఇంటర్నెట్, సోషల్ మీడియా, ఆన్లైన్ ట్రేడింగ్, బ్యాంకింగ్ సేవలను వినియోగించే సమయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రజలు ఎక్కువగా మోస పోతున్న మూడు ప్రధాన రకాల సైబర్ నేరాలపై జాగ్రత్తలు సూచించారు. తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని నమ్మబలికి ప్రజల డబ్బును దోచుకునే నకిలీ ట్రేడింగ్ యాప్లు, వెబ్సైట్లు విస్తరిస్తున్నాయని తెలిపారు. ప్రముఖ కంపెనీ పేరుతో నకిలీ ఐపీవో లను చూపించి పెట్టుబడులు దోచుకునే మోసపూరిత పద్ధతులు పెరుగుతున్నాయని చెప్పారు. ఆన్లైన్లో పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరిట మొదట చిన్న మొత్తాన్ని పెట్టుబడిగా అడిగి, అధిక లాభాలు వస్తాయని నమ్మబలికి తరువాత భారీ మొత్తాలు వసూలు చేసే మోసాలు విస్తరిస్తున్నాయని వివరించారు. ప్రజలు ఇలాంటి మోసాల బారిన పడకుండా ఉండేందుకు కింది జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గుర్తు తెలియని లింకులు లేదా యాప్ల ను డౌన్లోడ్ చేయవద్దనీ, బ్యాంక్ ఓటీపీ లు, వ్యక్తిగత వివరాలు ఎవరికీ ఇవ్వవద్దనీ అన్నారు. నమ్మదగని ఆఫర్లు, ఆకర్షణీయమైన ఉద్యోగ ప్రకటనలను నమ్మవద్దనీ, సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 హెల్ప్ లైన్ కు కాల్ చేయాలి లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని అన్నారు.




# మహిళా సంఘాలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ



**మాసాయిపేట, నవంబర్ 24 (ప్రజాస్వరం) :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మహిళా సంఘాలకు చీరలు పంపిణీ చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. మాసాయిపేట మండల కేంద్రంలో ఆదివారం ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు చీరలు పంపిణీ చేస్తుందని సందర్భంగా వారు తెలిపారు. మండల పరిధిలోని మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలను అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు వచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీకాంత్ నాగిరెడ్డి కృష్ణారెడ్డి సిద్ధిరాములు గౌడ్ సొసైటీ డైరెక్టర్ ఊదండపురం నరసింహులు టౌన్ ప్రెసిడెంట్ గుండారం శీను జగదీష్ మహమ్మద్ మక్సూద్ తదితరులు పాల్గొన్నారు

# చరిత్ర సృష్టించిన భారత మహిళలు.. తొలి అంధుల టీ20 ప్రపంచకప్ కైవసం

- **ఫైనల్‌లో నేపాల్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం**
- **టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా నిలిచిన భారత జట్టు**
- **ఫైనల్‌లో 44 పరుగులతో రాణించిన ఖులా షరీర్**
- **కొలంబో వేదికగా జరిగిన తుది పోరు**

**ప్రజాస్వరం, న్యూ ఢిల్లీ**

భారత మహిళల అంధుల క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. మొట్టమొదటిసారిగా నిర్వహించిన మహిళల అంధుల టీ20 ప్రపంచకప్‌ను కైవసం చేసుకుని సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. కొలంబో వేదికగా జరిగిన ఫైనల్‌లో నేపాల్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి విశ్వవిజేతగా నిలిచింది. టోర్నమెంట్ ఆసాంతం అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత జట్టు, ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా అజేయంగా టైటిల్‌ను ముద్దాడింది. ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు నేపాల్ బ్యాటర్లు తడబడ్డారు. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి నేపాల్ జట్టు 114 పరుగులు మాత్రమే చేయగలిగింది. అనంతరం 115 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు, కేవలం 12.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. ఖులా షరీర్ 27 బంతుల్లో 4 ఫోర్లతో అజేయంగా 44 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. నవంబర్ 11న ఢిల్లీలో ప్రారంభమైన ఈ టోర్నీలో భారత్, నేపాల్, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, శ్రీలంక, అమెరికా జట్లు పాల్గొన్నాయి. సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాపై 9 వికెట్ల తేడాతో గెలిచి భారత్ ఫైనల్‌కు చేరింది. ఈ చారిత్రక విజయం దేశంలో అంధుల క్రికెట్‌కు మరింత గుర్తింపు, ప్రోత్సాహం లభించడానికి మార్గం సుగమం చేస్తుందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.



# తేలిపోయిన భారత బౌలర్లు.. రెండో రోజూ దక్షిణాఫ్రికా జోరు

- **గౌహతిలో జరుగుతున్న రెండో టెస్టు**
- **శతకంతో కదం తొక్కిన సెనురన్ ముత్తుసామి (109)**
- **మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్న మార్కో యన్‌సెన్ (93)**
- **భారత బౌలర్లలో నాలుగు వికెట్లతో రాణించిన కుల్దీప్ యాదవ్**
- **టీమిండియా ముందు భారీ స్కోరును ఉంచిన సఫారీ జట్టు**

**ప్రజాస్వరం, న్యూ ఢిల్లీ**

గౌహతి వేదికగా భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా జట్టు భారీ స్కోరు సాధించింది. రెండో రోజు ఆటలో భాగంగా తొలి ఇన్నింగ్స్‌లో 151.1 ఓవర్లలో 489 పరుగులకు ఆలౌట్ అయింది. సెనురన్ ముత్తుసామి (109) అద్భుతమైన శతకంతో ఆకట్టుకోగా, మార్కో యన్‌సెన్ (93) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో భారత బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఈ ఇద్దరితో పాటు ట్రిస్టన్ స్టబ్స్ (49), కైల్ వెర్రెయిన్నె (45), టెంబా బావుమా (41) కీలక పరుగులు చేశారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికాకు ఆదిలోనే ఎదురు దెబ్బలు తగిలినా, మిడిల్ ఆర్డర్, లోయర్ ఆర్డర్ బ్యాటర్లు అద్భుతంగా రాణించారు. ముఖ్యంగా ఎనిమిదో వికెట్‌కు ముత్తుసామి, జాన్‌సెన్ కలిసి 97 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. కేవలం 91 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లతో 93 పరుగులు చేసిన యన్‌సెన్ సెంచరీకి చేరువలో ఔటయ్యాడు. ముత్తుసామి మాత్రం ఓపికగా ఆడి తన టెస్ట్ కెరీర్‌లో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. భారత బౌలర్లలో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ 115 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. అతనికి తోడుగా జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో రెండు వికెట్లు తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు సాధించిన దక్షిణాఫ్రికా, మ్యాచ్‌పై పట్టు బిగించింది.



అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా రెండో రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 9 పరుగులు చేసింది. ఓపెనర్లు కేఎల్ రాహుల్ (2 బ్యాటింగ్), యశస్వి జైస్వాల్ (7 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. సఫారీల తొలి ఇన్నింగ్స్ స్కోరుకు టీమిండియా ఇంకా 480 పరుగులు వెనుకబడి ఉంది. రేపు ఆటకు మూడో రోజు భారత బ్యాటర్లు ఎలా రాణిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

### భారత్‌లో వరల్డ్ కప్.. టీమిండియా గ్రూప్‌లోనే పాకిస్థాన్..

# మరోసారి దాయాదుల పోరు

- **2026 టీ20 వరల్డ్ కప్‌లో ఒకే గ్రూపులో భారత్, పాకిస్థాన్**
- **భారత్, శ్రీలంక సంయుక్తంగా అందిస్తున్న ఆతిథ్యం**
- **భారత్ గ్రూప్‌లో నెదర్లాండ్స్, నమీబియా, అమెరికా జట్లు**
- **పాకిస్థాన్ ఫైనల్‌కు వస్తే అహ్మదాబాద్ నుంచి కొలంబోకు వేదిక మార్పు?**

**ప్రజాస్వరం, న్యూ ఢిల్లీ**



క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే దాయాదుల సమరానికి మరోసారి రంగం సిద్ధమైంది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న 2026 ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్‌లో చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ జట్లు ఒకే గ్రూపులో చోటు దక్కించుకున్నాయి. ఇటీవలే 2025 ఆసియా కప్ సందర్భంగా ఇరు జట్ల మధ్య చోటుచేసుకున్న మాటల యుద్ధం, వివాదాస్పద సంజ్ఞల నేపథ్యంలో ఈ డ్రాకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ డ్రా ప్రకారం టీ20 ర్యాంకింగ్స్‌లో నంబర్ 1 స్థానంలో ఉన్న భారత్‌తో పాటు పాకిస్థాన్, నెదర్లాండ్స్, నమీబియా, అమెరికా జట్లు ఒకే గ్రూపులో ఉన్నాయి. ఈ గ్రూపులో టెస్టు హోదా ఉన్నవి భారత్, పాకిస్థాన్ మాత్రమే కావడంతో ఈ రెండు జట్లు సులువుగా సూపర్ 8 దశకు చేరుకునేలా డ్రాను రూపొందించారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రూప్ దశలో భారత మ్యాచ్‌లు ముంబై, కోల్‌కతా, చెన్నై, ఢిల్లీ, అహ్మదాబాద్ వేదికగా జరగనున్నాయి. మరోవైపు సహ ఆతిథ్య దేశమైన శ్రీలంకకు మాత్రం కఠినమైన గ్రూప్ ఎదురైంది. ఆస్ట్రేలియా, జింబాబ్వే, ఐర్లాండ్, ఒమన్‌లతో కూడిన గ్రూపులో శ్రీలంక తలపడనుంది. టోర్నమెంట్‌కు సంబంధించి మరో కీలకమైన విషయం వెలుగులోకి వచ్చింది. ఒకవేళ పాకిస్థాన్ ఫైనల్‌కు అర్హత సాధిస్తే, ఆ మ్యాచ్‌ను అహ్మదాబాద్ నుంచి కొలంబోకు మార్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

### ఆగిపోయిన స్మృతి మంధాన పెళ్లి

**ప్రజాస్వరం, న్యూ ఢిల్లీ**

మరికొద్దిసేపటిలో క్రికెటర్ స్మృతి మంధాన వివాహం ఆమె ప్రియుడు పాలష్ ముచ్చల్ తో ఘనంగా జరగాల్సి ఉండగా.. అనుకోని సంఘటనతో ఆమె పెళ్లి వాయిదా పడింది. మహారాష్ట్రలోని సంగ్లీ జిల్లా సాందోల్ లో గల మంధాన ఫాంహౌస్ వద్ద వివాహానికి ఘనంగా ఏర్పాట్లు జరిగాయి. కొద్దిరోజులుగా వీరి ప్రీవెడ్డింగ్ సెలబ్రేషన్స్ ఫొటోలు కూడా నెట్టింట వైరల్ గా మారాయి. ఇటీవల జరిగిన సంగీత్ లో కూడా స్మృతి చాలా జోష్‌ఫుల్ గా డ్యాన్స్ చేసింది. ఈ వివాహ వేడుకను చూసేందుకు దేశ నలుమూలల నుంచి పలువురు అతిథులు సంగ్లీకి చేరుకున్నారు. కానీ.. స్మృతి తండ్రి శ్రీనివాస్ మంధానకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఆయన్ను ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నప్పటికీ పెళ్లిని వాయిదా వేయాలని కుటుంబం నిర్ణయించింది. కొద్దిసేపట్లో పెళ్లి జరుగుతుందనగా తండ్రికి గుండెపోటు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె బిజినెస్ మేనేజర్ తుహిన్ మిశ్రా ఈ విషయాన్ని వెల్లడించారు. ఎమర్జెన్సీ నేపథ్యంలో వివాహ వేడుకల్ని వెంటనే రద్దు చేస్తున్నట్లు తెలిపారు. తదుపరి వివాహ తేదీ ఎప్పుడు అనేది వెల్లడించలేదు.

### ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా లక్ష్య సేన్..

# టైటిల్ నిరీక్షణకు తెర

- **ఫైనల్‌లో జపాన్ షట్లర్ యుషి టనాకాపై సునాయాస విజయం**
- **కెరీర్‌లో మూడో సూపర్ 500 టైటిల్‌ను కైవసం చేసుకున్న భారత స్టార్**
- **చాలా కాలంగా కొనసాగుతున్న టైటిల్ నిరీక్షణకు తెర**
- **ప్రత్యర్థి తప్పిదాలతో ఏకపక్షంగా సాగిన ఫైనల్ పోరు**

**ప్రజాస్వరం, న్యూ ఢిల్లీ**

భారత స్టార్ షట్లర్ లక్ష్య సేన్ తన టైటిల్ నిరీక్షణకు తెరదించాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్‌లో జపాన్ క్రీడాకారుడు యుషి టనాకాను 2115, 2111 తేడాతో సునాయాసంగా ఓడించి విజేతగా నిలిచాడు. ఈ ఫైనల్ మ్యాచ్ లక్ష్య సేన్ కెరీర్‌లోనే అత్యంత సులువైన ఫైనల్స్‌లో ఒకటిగా నిలిచింది. కేవలం 38 నిమిషాల్లోనే ముగిసిన ఈ పోరులో టనాకా పూర్తిగా తేలిపోయాడు. అతను కొట్టిన స్మాష్‌లు చాలాసార్లు బయటకు వెళ్లగా, నెట్ వద్ద చేసిన తప్పిదాలు కూడా లక్ష్య సేన్‌కు కలిసొచ్చాయి. దీంతో లక్ష్య సేన్ పెద్దగా శ్రమించకుండానే, ప్రత్యర్థి తప్పిదాలను తనకు అనుకూలంగా మార్చుకుని విజయం సాధించాడు. తొలి గేమ్‌లో 1513 వద్ద టనాకా కాస్త పోటీ ఇచ్చినప్పటికీ, ఆ తర్వాత లక్ష్య సేన్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. లక్ష్య సేన్‌కు ఇది మూడో సూపర్ 500 టైటిల్. ఈ ఏడాది హాంగ్‌కాంగ్ ఓపెన్‌లో ఫైనల్‌కు చేరినా ఓటమిపాలైన అతను, ఈసారి మాత్రం టైటిల్‌ను చేజార్చుకోలేదు. సెమీఫైనల్‌లో 85 నిమిషాల పాటు హోరాహోరీగా పోరాడి గెలిచిన లక్ష్య సేన్‌కు, ఫైనల్ మాత్రం చాలా తేలికైంది. విజయం సాధించిన అనంతరం లక్ష్య సేన్ తన రెండు చేతి వేళ్లను చెవుల్లో పెట్టుకుని, కళ్లు మూసుకుని సంబరాలు చేసుకున్నాడు. ఈ వారం తాను ఎదుర్కొన్న తీవ్రమైన ఒత్తిడికి ఇది నిదర్శనంగా కనిపించింది. పారిస్ ఒలింపిక్స్‌లో ఎదురైన నిరాశ తర్వాత పట్టుదలతో రాణిస్తున్న లక్ష్య సేన్.. వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు అర్హత సాధించలేకపోయినా, ఈ టైటిల్‌తో అంతర్జాతీయ పర్యటనను ఘనంగా ముగించాడు.



### శ్రేయస్ అయ్యర్‌కు గాయం..

# 2-3నెలలు ఆటకు దూరం?

**ప్రజాస్వరం, న్యూ ఢిల్లీ**



టీమిండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ 23 నెలలు ఆటకు దూరం కానున్నట్టు తెలుస్తోంది. గత నెలలో ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో అయ్యర్ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. క్యాచ్ అందుకునే క్రమంలో నేలకు బలంగా తాకడంతో కడుపులో గాయమైంది. ప్లీహం చీలిపోయి, అంతర్గత రక్తస్రావం అయినట్టు వార్తలు వచ్చాయి. ప్రస్తుతం అతను స్పోర్ట్స్ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ దిన్షా పార్దివాలా పర్యవేక్షణలో ఉన్నాడు. ఇటీవల అతనికి అల్ట్రాసౌండ్ సోనోగ్రఫీ టెస్టు చేయించుకున్నాడు. నివేదిక ప్రకారం.. అయ్యర్ మెరుగ్గా కోలుకుంటునప్పటికీ ఫిట్‌నెస్ సాధించడానికి ఎక్కువ సమయం పడుతుందని తెలుస్తోంది. కడుపుపై ఒత్తిడి పడేలా కఠినమైన వ్యాయామాలు చేయొద్దని అతనికి వైద్యులు సూచించారు. ఇప్పట్లో అతను మైదానంలో అడుగుపెట్టే అవకాశాలు లేవు. త్వరలో జరగబోయే సౌతాఫ్రికాతో వన్డే సిరీస్‌తోపాటు జనవరిలో జరిగే న్యూజిలాండ్‌తో జరిగే వైట్‌బాల్ సిరీస్‌కు అయ్యర్ దూరంకానున్నాడు. వచ్చే ఏడాది జరగబోయే టీ20 వరల్డ్ కప్, ఐపీఎల్ 2026లో పాల్గొంటాడా?లేదా? చూడాలి. వచ్చే వారం అయ్యర్‌కు మరోసారి అల్ట్రాసౌండ్ సోనోగ్రఫీ చేయించుకోనున్నట్టు సమాచారం. రెండు నెలల తర్వాత బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చేరనున్నాడు.

### సచిన్ రికార్డును అందుకునే క్రమంలో

# మళ్లీ చతికిలబడిన రూట్!

- **సచిన్ రికార్డు బ్రేక్ చేయాలన్న లక్ష్యంతో బరిలోకి దిగిన జో రూట్**
- **పెర్త్ యాషెస్ టెస్టులో రెండు ఇన్నింగ్స్‌లలోనూ దారుణంగా విఫలం**
- **ఆస్ట్రేలియా గడ్డపై రూట్‌కు కొనసాగుతున్న పేలవ ఫామ్**
- **తొలి టెస్టులో 8 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై ఆసీస్ ఘన విజయం**
- **మిచెల్ స్టార్క్, ట్రావిస్ హెడ్ అద్భుత ప్రదర్శనతో ఆసీస్ గెలుపు**

**ప్రజాస్వరం, న్యూ ఢిల్లీ**

క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ రికార్డును బద్దలు కొట్టాలనే లక్ష్యంతో ఆస్ట్రేలియాలో అడుగుపెట్టిన ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్‌కు మరోసారి తీవ్ర నిరాశే ఎదురైంది. ఆస్ట్రేలియా గడ్డపై తన పేలవమైన రికార్డును కొనసాగిస్తూ, పెర్త్‌లో జరిగిన యాషెస్ తొలి టెస్టులో ఘోరంగా విఫలమయ్యాడు. మొదటి ఇన్నింగ్స్‌లో డకౌట్‌గా వెనుదిరిగిన రూట్, రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 8 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. రెండు సార్లూ ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ బౌలింగ్‌లోనే వికెట్ సమర్పించుకోవడం గమనార్హం. ఈ వైఫల్యంతో సచిన్ రికార్డును అధిగమించాలన్న రూట్ కల మరింత దూరమైంది. పెర్త్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 8 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్, హ్యారీ బ్రూక్ (52) రాణించడంతో తొలి ఇన్నింగ్స్‌లో 172 పరుగులకు ఆలౌటైంది. ఆసీస్ బౌలర్ మిచెల్ స్టార్క్ 58 పరుగులిచ్చి 7 వికెట్లు పడగొట్టి ఇంగ్లండ్ పతనాన్ని శాసించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 132 పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ కేవలం 23 పరుగులిచ్చి 5 వికెట్లు తీసి సత్తా చాటాడు. దీంతో ఇంగ్లండ్‌కు 40 పరుగుల ఆధిక్యం లభించింది. అయితే, రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ బ్యాటర్లు చేతులెత్తేశారు. ముఖ్యంగా జో రూట్ (8) మరోసారి నిరాశపరిచాడు. దీంతో ఆస్ట్రేలియా ముందు 205 పరుగుల లక్ష్యం నిలిచింది. ఈ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ట్రావిస్ హెడ్ మెరుపు సెంచరీతో చెలరేగాడు. అతనికి మార్నస్ లబుషేన్, స్టీవ్ స్మిత్ అండగా నిలవడంతో ఆస్ట్రేలియా 2 వికెట్లు మాత్రమే కోల్పోయి సునాయాసంగా విజయాన్ని అందుకుంది.

**ఆస్ట్రేలియాలో అందని ద్రాక్ష**

ప్రపంచ టెస్ట్ క్రికెట్‌లో సచిన్ (15,921) తర్వాత అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా జో రూట్ (13,551) రెండో స్థానంలో ఉన్నాడు. 159 టెస్టుల్లో 50.94 సగటుతో 39 సెంచరీలు సాధించిన రూట్‌కు, ఆస్ట్రేలియా గడ్డపై మాత్రం రికార్డు దారుణంగా ఉంది. ఆసీస్‌లో ఇప్పటివరకు 15 టెస్టులు ఆడినా ఒక్క సెంచరీ కూడా చేయలేకపోయాడు. కేవలం 33.33 సగటుతో 900 పరుగులు మాత్రమే చేశాడు. ఇప్పుడు తొలి టెస్టులోనూ విఫలం కావడంతో, మిగిలిన 4 టెస్టుల్లోనైనా రాణించి సచిన్ రికార్డుకు చేరువవుతాడో లేదో చూడాలి.



# టీమిండియాకు షాక్.. సౌతాఫ్రికాతో వన్డే సిరీస్‌కు గిల్ దూరం?

**ప్రజాస్వరం, న్యూ ఢిల్లీ**



సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌కు బీసీసీఐ ఆదివారం భారత జట్టును ప్రకటించనున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ సిరీస్‌కు భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ దూరం కానున్నట్టు తెలుస్తోంది. సౌతాఫ్రికాతో తొలి టెస్టులో గిల్ మెడనొప్పితో మైదానం వీడాడు. రెండో టెస్టు నాటికి కూడా అతను కోలుకోకపోవడంతో గువహతి మ్యాచ్‌కు దూరమైన విషయం తెలిసిందే. గిల్‌కు రెస్ట్ అవసరమని వైద్యులు సూచించినట్టు తెలుస్తోంది. టీమ్ మేనేజ్‌మెంట్ కూడా అతని విషయంలో రిస్క్ తీసుకోవద్దని భావిస్తున్నట్టు పేర్కొన్నాయి. ప్రస్తుతం గిల్ ముంబైలో ఉన్నాడు. గాయం తీవ్రత నిర్ధారణకు ఎంఆర్ఐ, ఇతర మెడికల్ టెస్టులు చేయించుకున్నాడు. 'కండరాల గాయమా లేదా నరాల కణజాల సంబంధిత నొప్పి ఉందా అని తెలుసుకోవడానికి అన్ని మెడికల్ టెస్టులు జరుగుతున్నాయి. సౌతాఫ్రికాతో వన్డే సిరీస్‌కు అతను అందుబాటులో ఉండడు. టీ20 సిరీస్ నాటికి అతను ఫిట్‌గా ఉంటాడని సెలెక్టర్లు ఆశిస్తున్నారు.'అని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఒకవేళ గిల్ దూరమైతే వన్డే సిరీస్‌కు రిషబ్ పంత్‌ను కెప్టెన్‌గా నియమించే అవకాశాలు ఉన్నాయి. కేఎల్ రాహుల్‌కు పగ్గాలు అప్పగించే చాన్స్‌లు లేకపోలేదు.

### ప్రియురాలితో ఇంగ్లాండ్ క్రికెటర్

# సామ్ కరన్ ఎంగేజ్మెంట్



**ప్రజాస్వరం, న్యూ ఢిల్లీ**

ఇంగ్లాండ్ స్టార్ క్రికెటర్ సామ్ కరన్ తన ప్రేయసి ఇసాబెల్లా గ్రేస్ సైమండ్స్-విల్మాట్‌తో అధికారికంగా నిశ్చితార్థం చేసుకున్నారు. వారి ఎంగేజ్మెంట్ కు సంబంధించి సోషల్ మీడియాలో ఈ జంట పంచుకున్న ఫోటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. చాలా కాలంగా ప్రేమలో ఉన్న ఈ జంట చివరకు తమ బంధాన్ని మరో మెట్టు తీసుకెళ్లారు. 2018 లో పరిచయం అయిన వీరి ప్రేమ కథ అప్పటి నుంచే బలపడ్డట్లు ఆమెకు దగ్గరగా ఉన్న వారు చెబుతున్నారు. 1998లో ఇంగ్లండ్‌లో జన్మించిన ఇసాబెల్లా, ప్రస్తుతం లండన్‌లో స్థిరపడింది. గత కొన్నేళ్లుగా సామ్ మ్యాచ్‌లకు తరచూ హాజరవుతూ, అతనికి అత్యంత పెద్ద మద్దతుదారుగా నిలిచింది. ఇప్పుడు నిశ్చితార్థం అనంతరం త్వరలోనే పెళ్లి తేదీ ప్రకటించే అవకాశం ఉందని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ఈ శుభవార్తతో క్రికెట్ అభిమానులు, సెలబ్రిటీలు ఇద్దరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

## మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా

# ప్రభాస్ 'స్పిరిట్' ప్రారంభం

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, 'యానిమల్' ఫేమ్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రం 'స్పిరిట్' లాంఛనంగా ప్రారంభమైంది. ఈ చిత్ర పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెగాస్టార్ చిరంజీవి హాజరై, ముహూర్తం షాట్ కు క్లాప్ కొట్టారు. హైదరాబాద్‌లో ఆదివారం ఈ కార్యక్రమం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి చిత్ర యూనిట్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ తృప్తి దిమ్రి, నిర్మాతలు భూషణ్ కుమార్, వంగా ప్రణయ్, శివ తదితరులు పాల్గొన్నారు. ఈ సినిమాలో ప్రభాస్ ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారని చిత్రబృందం తెలిపింది. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సందీప్ రెడ్డి వంగా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండటంతో అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఈ చిత్రాన్ని టీసిరీస్, వంగా పిక్చర్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు.





# 'రెబెల్ సాబ్' ప్రోమో ఇదిగో

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ది రాజా సాబ్' సినిమా నుంచి అదిరిపోయే అప్డేట్ వచ్చింది. ఈ చిత్రంలోని తొలి పాట 'రెబెల్ సాబ్' ప్రోమోను చిత్ర బృందం శనివారం విడుదల చేసింది. పూర్తి పాటను ఆదివారం రాత్రి 8.11 గంటలకు విడుదల చేయనున్నట్టు ప్రకటించింది. ఈ వార్తతో ప్రభాస్ అభిమానులు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. విడుదలైన ఈ ప్రోమోలో ప్రభాస్ ఎంట్రీ, ఆయన స్వాగ్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సంగీత దర్శకుడు తమన్ అందించిన బీట్స్ పవర్‌ఫుల్‌గా ఉన్నాయి. మారుతి దర్శకత్వంలో ఈ సినిమా పూర్తిస్థాయి మాస్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్నట్టు ఈ ప్రోమో చూస్తే స్పష్టమవుతోంది. "స్వేగ్ & ఎంట్రీ లెవెల్ పాన్ ఇండియా నెం.1" అంటూ మేకర్స్ ఈ ప్రోమోను పంచుకున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ సరసన మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ హీరోయిన్లుగా నటిస్తుండగా.. బాలీవుడ్ నటుడు సంజయ్ దత్, బోమన్ ఇరానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న ఈ సాంగ్ ప్రోమో, సినిమాపై అంచనాలను మరింత పెంచింది. 'ది రాజా సాబ్' చిత్రాన్ని 2026 జనవరి 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



## కేసు గెలిచా..

# అమ్మను కోల్పోయా

సినీ నటి హేమకు బెంగళూరు రేవ్ పార్టీ డ్రగ్స్ కేసులో భారీ ఊరట లభించింది. ఆమెపై నమోదైన కేసును కర్ణాటక హైకోర్టు పూర్తిగా కొట్టివేసింది. అయితే, ఈ న్యాయపోరాటంలో గెలిచినా, తన జీవితంలో తీరని విషాదం మిగిలిపోయిందని హేమ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు కారణంగా జరిగిన సోషల్ మీడియా ట్రోలింగ్, మీడియా కథనాల వల్లే తన తల్లి మరణించిందని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. ఈ మేరకు హేమ సోషల్ మీడియాలో ఓ భావోద్వేగ వీడియోను విడుదల చేశారు. గతేడాది బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీ ఘటన తన జీవితాన్ని అతలాకుతలం చేసిందని, ఆ కేసులో తనపై వచ్చిన ఆరోపణలన్నీ నిరాధారమని ఇప్పుడు న్యాయస్థానం తీర్పుతో తేలిపోయిందని తెలిపారు. ఈ నెల 3నే తీర్పు వెలువడినా, జడ్జిమెంట్ కాపీ చేతికి అందే వరకు ఈ విషయాన్ని బయటపెట్టలేదని వివరించారు. ఈ కేసు విచారణ సమయంలో మీడియా, సోషల్ మీడియాలో వచ్చిన తప్పుడు కథనాలు, ట్రోలింగ్ తన తల్లిని మానసికంగా కృంగదీశాయని హేమ ఆరోపించారు. "ఫేక్ న్యూస్, ట్రోలింగ్ మా అమ్మను చంపేశాయి. నాపై వచ్చిన నిందలను ఆమె తట్టుకోలేకపోయారు. తీవ్ర మనస్తాపానికి గురై స్ట్రోక్‌తో చనిపోయారు" అంటూ ఆమె వాపోయారు. తాను నిర్దోషినని, ఏ తప్పూ చేయలేదని ఆమె స్పష్టం చేశారు. "సింహం రెండు అడుగులు వెనక్కి వేస్తే పారిపోతున్నట్టు కాదు, మళ్లీ దూకడానికే. నేను కూడా అలాగే నిలబడ్డాను. దేవుడి దయతో కేసు గెలిచాను. కానీ, ఈ ట్రోలింగ్ వల్ల నేను చనిపోయి ఉంటే, ఈ తీర్పు ఎవరికి ఉపయోగం? నన్ను ఎవరు బతికిస్తారు?" అని హేమ ఆవేదనతో ప్రశ్నించారు. ఏడాదిన్నరగా తాను, తన కుటుంబం మానసికంగా, శారీరకంగా తీవ్ర క్షోభ అనుభవించామని ఆమె తెలిపారు. కోర్టు క్లీన్‌చిట్ ఇచ్చినప్పటికీ, తన తల్లిని కోల్పోవడం తీరని లోటని ఆమె పేర్కొన్నారు.






## ఆగింది ఐబొమ్మే..

# పైరసీ కాదు

పైరసీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించినా ఫలితం లేకుండా పోయింది. ఐబొమ్మ వెబ్ సైట్ నిర్వాహకుడు ఇమంది రవిని అరెస్టు చేసి ఐబొమ్మతో పాటు బప్పం టీవీ సైట్ లను క్లోజ్ చేసినా సినిమా పైరసీ ఆగడంలేదు. ఆగింది ఐబొమ్మే తప్ప పైరసీ కాదని తాజాగా తేలింది. శుక్రవారం విడుదలైన సినిమాలన్నీ ఒకే రోజులో పైరసీ సైట్లలో ప్రత్యక్షం కావడమే దీనికి నిదర్శనం. ఐబొమ్మ కన్నా ముందునుంచే సినిమాలను పైరసీ చేస్తున్న మూవీరూల్జ్ సైట్ లో తాజా సినిమాలన్నీ ప్రత్యక్షమయ్యాయి. థియేటర్లలో వీడియో కెమెరాతో రికార్డు చేసి ఈ సైట్ లో అప్ లోడ్ చేసినట్లు తెలుస్తోంది. తాజా సినిమాలు అల్లరి హీరోగా వచ్చిన 12ఏ రైల్వే కాలనీతో పాటు సంతాన ప్రాప్తిరస్తు, రాజు వెడ్స్ రాంబాయి, ప్రేమంటే సినిమాలు మూవీరూల్జ్ సైట్ లో కనిపిస్తున్నాయి. విడుదలైన ఒక్కరోజులోనే సినిమాలు పైరసీ సైట్ లో ప్రత్యక్షం కావడంతో నిర్మాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# హీరోయిన్లకు ఎంత టాలెంట్ ఉన్నా వేస్టే

టాలీవుడ్ నటి రాశీ ఖన్నా చేసిన కొన్ని వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. సినిమా ఇండస్ట్రీలో హీరోలకు, హీరోయిన్లకు మధ్య ఉన్న ప్రాధాన్యత, గౌరవం విషయంలో నెలకొన్న అసమానతపై ఆమె స్పందించారు. నటీనటుల మార్కెట్ విలువ ఎలా ఉన్నా, సినిమా సెట్స్‌లో మాత్రం అందరికీ సమాన గౌరవం దక్కాలని ఆమె అభిప్రాయపడ్డారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన రాశీ ఖన్నా, "మన దేశంలో చాలా కాలంగా హీరో వర్షిప్ కల్చర్ ఉంది. హీరోలు బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధిస్తారని అందరూ నమ్ముతారు. అది నిజమే కావచ్చు, కానీ మార్కెట్ అనేది జెండర్‌పై కాదు, టాలెంట్‌పై ఆధారపడి ఉంటుంది" అని స్పష్టం చేశారు. తెరపై ఎవరికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలనేది వారి మార్కెట్ నిర్ణయిస్తుందని, కానీ సెట్స్‌లో మాత్రం ఆ తేడా చూపించకూడదని అన్నారు. మహిళా నటీమణుల పట్ల ప్రవర్తన, వారికి కల్పించే సదుపాయాలు, ఇచ్చే గౌరవంలో ఎలాంటి వ్యత్యాసం ఉండకూడదని ఆమె పేర్కొన్నారు. 'ఊహలు గుసగుసలాడే' చిత్రంతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన రాశీ ఖన్నా, ఆ తర్వాత పలు విజయవంతమైన చిత్రాల్లో నటించారు. మధ్యలో కొంత గ్యాప్ తీసుకుని, బాలీవుడ్‌లో కూడా తనను తాను నిరూపించుకున్నారు. ఇటీవల 'తెలుసు కదా' సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న ఆమె, ప్రస్తుతం పవన్ కల్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రస్తుతం రాశీ ఖన్నా చేసిన ఈ వ్యాఖ్యలపై నెటిజన్ల నుంచి విస్తృత మద్దతు లభిస్తోంది. ఇండస్ట్రీలో మహిళా నటీనటులకు కూడా సమాన గౌరవం ఇవ్వాలంటూ చాలా మంది ఆమె అభిప్రాయంతో ఏకీభవిస్తున్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999